మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





నారాయణపేట జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

## జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు: జిల్లా ఎస్పీ

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** ముందస్తు అనుమతి లేకుండా ర్యాలీలు, సమావేశాలు, బహిరంగ కార్యక్రమాలు, సభలు నిషేధం, సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తప్పవు. మత విద్వేషాలు రెచ్చగొట్టే వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయి. శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా నారాయణపేట జిల్లా వ్యాప్తంగా ఈ నెల రోజుల పాటు జనవరి 31 వరకు 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్నందున జిల్లాలో పోలీసు అధికారుల అనుమతులు లేకుండా ఎలాంటి ర్యాలీలు, సమావేశాలు, ఊరేగింపులు, ధర్నాలు, ఫంక్షన్ హాల్లో కార్యక్రమాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమ్మిగుడి ఉండే విధంగా కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేయరాదని తెలిపారు. అనుమతులు లేకుండా పై కార్యక్రమాలు నిర్వహించిన నిర్వాహకులపై చట్టపరమైన చర్యలు తప్పవని తెలిపారు. ప్రజా జీవనానికి ఇబ్బంది కలిగించేందుకు దారి తీసే సమావేశాలు, జన సమూహం చేయడం పూర్తిగా నిషేధమని తెలిపారు. సోషల్ మీడియా నందు అనవసరమైన విషయాలను, మతాల మధ్య చిచ్చు పెట్టే అంశాలను వ్యాప్తి చేసిన వారిపై కేసులను నమోదు చేయబడతాయని తెలిపారు. చట్టపరంగా జారీ చేసిన ఆదేశాలను ఎవరైనా ఉల్లంఘించినట్లయితే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్ష అర్హులవుతారని తెలిపారు. నిషేధంలో ఉన్న నిబంధనలు తప్పనిసరిగా అందరూ పాటించాలని ఎలాంటి కార్యక్రమాలు నిర్వహించాలన్న ముందస్తు దరఖాస్తు చేసుకునే అనుమతులు తీసుకోవాలని ఎస్పి కోరారు.

## భూమిలేని నిరుపేదలకు రూ.12వేల ఆర్థిక చేయుత

### ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం

### చారిత్రాత్మకం : ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి ప్రతినిధి జనవరి 5 ప్రభాతవార్త :** అన్నదాతల అభ్యున్నతిని దృష్టిలో ఉంచుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలు రైతులకు అన్ని విధాలుగా లబ్ధిచేకూరుస్తున్నాయని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం రైతు భరోసాను రూ 12 వేలకు పెంచిందన్నారు. గత ప్రభుత్వం కేవలం రూ.10 వేలు రైతు బంధు ఇచ్చిందని అంతకంటే ఎక్కువగా రైతు భరోసా పథకం ద్వారా కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి ఏడాది ఎకరానికి రూ.12 వేల చొప్పున రైతులందరికీ పెట్టుబడి సాయం చెల్లించాలని నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తెలిపారు. ఎలాంటి షరతుల్లేకుండా వ్యవసాయ యోగ్యమైన భూములన్నింటికీ ప్రతీ ఎకరానికి రైతు భరోసా చెల్లింపు జరుగుతుందన్నారు. గత ప్రభుత్వం చెల్లించినట్లుగా రాళ్ల రప్పలు, రోడ్ల రహదారులకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు రైతు భరోసా నిలిపివేయడంతో నిజమైన రైతన్నలకు న్యాయం జరుగుతుందన్నారు. ఈ నెల 20వ తేదీలోగా ఈ అనర్హులను గుర్తించి తొలగించే ప్రక్రియను ప్రత్యేక అధికారుల బృందం చేపడుతుందని ఆయన అన్నారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీ నాటికి 75 సంవత్సరాలు పూర్తి అవుతాయని ఈ రిపబ్లిక్ డే ఉత్సవాలను పురస్కరించుకుని అదే రోజు నుంచి రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులు జమ చేయనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు. భూమిలేని వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆదుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమం చేపట్టిందని దేశంలో ఎక్కడా లేని విధంగా నిరుపేద వ్యవసాయ కూలీ కుటుంబాలను ఆర్థికంగా అదుకునేందుకు ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం ద్వారా ఏడాదికి రూ.12 వేలు నగదు ఆర్థిక సహాయం అందజేయునున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విద్యానిధికి విరాళాల వెల్లువ

### ఎమ్మెల్యేకి రూ.2లక్షల చెక్కు అందించిన రిషి విద్యాసంస్థల డైరెక్టర్లు

### రూ.50వేల చెక్కు అందజేసిన చలవగాలి శ్రీనివాస్ రాజు

### ఎమ్మెల్యే ఆశయంలో మేము సైతం అంటూ ప్రకటన

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పిలుపునకు భారీ స్పందన



ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డికి రూ. 2 లక్షల చెక్కు అందజేస్తున్న రిషి సంస్థ డైరెక్టర్

**మహబూబ్‌గర్ బ్యూరో, జనవరి 5 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి స్థాపించిన విద్యా నిధితో మహబూబ్ నగర్ లో ఎంతోమంది పేద విద్యార్థులకు ఉపయోగపడుతుందని వారు తెలిపారు. అందుకు తమ వంతు సహకారం అందించాలనే సంకల్పంతో రెండు లక్షల రూపాయలను అందిస్తున్నామని ఎమ్మెల్యే కు తెలిపారు. ఎమ్మెల్యే ఆశయం మహబూబ్‌నగర్‌ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయుటకు తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మీరు ఇచ్చిన ఈ ప్రోత్సహం - మిగతా4లో..

## ఆధునిక సాంకేతిక విద్యకు పెద్ద పీట వేస్తాం

### వైద్య, విద్య, స్టడీ సర్కిల్ ఏర్పాటుకు శాయశక్తుల కృషి చేస్తా

### రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి

**వనపర్తి ప్రతినిధి, జనవరి 5 ప్రభాతవార్త :** ఆధునిక సాంకేతిక విద్యకు తెలంగాణలో పెద్ద పీట వేస్తామని రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు డా. జిల్లెల్ల చిన్నా రెడ్డి అన్నారు. ఆదివారం వనపర్తి శ్రీ రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో గత నెలలో శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా నిర్వహించిన ఐఐటి టాలెంట్ టెస్ట్ విజేతలకు బహుమతి ప్రదానం చేసే కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చిన్నారెడ్డి మాట్లాడుతూ ప్రభ్నుత్వ విద్య వ్యవసాయ పారిశ్రామిక రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపాడానికి చిత్తశుద్ధితో పని చేస్తుందని, నేటి విద్యార్థులు ఆధునిక సాంకేతిక విద్యను అందిపుచ్చుకోవడానికి కష్టపడి చదివాలని పిలుపునిచ్చారు. వనపర్తినీ విద్యా రంగంలో ముందు వరుసలో నిలపడానికి విద్యాహబ్ గా మార్చడానికి తన వంతు ప్రయత్నం చేశానన్నారు. వైద్య సాంకేతిక విద్యకు సంబంధించిన స్టడీ సర్కిల్ ఇక్కడ ఏర్పాటు చేయడానికి శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లాలో ఇలాంటి టాలెంట్ టెస్ట్ లు నిర్వహించడం అభినందనీయమని అవి విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపడానికి ఎంతో దోహదం చేస్తాయని అభిప్రాయపడ్డారు. ఇందుకోసం పిల్లలను ప్రోత్సహించడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రుల పాత్ర కూడా ఎంతో ఉందని చిన్నారెడ్డి వివరించారు. ఈ టాలెంట్ టెస్ట్ ను ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన రామన్ ఎడ్యుకేషనల్ సొసైటీ డైరెక్టర్ దేశి రాములు యాదవ్ ఎంతైనా అభినందనీయులని ఆయన కొనియాడారు. అనంతరం విజేతలకు చిన్నారెడ్డి నగదు పారితోషికం శాలువా, జ్ఞాపికలతో సన్మానించారు. ఈనాటి కార్యక్రమంలో సాహితీ కళా వేదిక జిల్లా అధ్యక్షుడు పలుస శంకర్ గౌడ్, డిసిఈబి జిల్లా సెక్రటరీ సూర చంద్ర శేఖర్, మండల విద్యాశాఖాధికారులు మద్దిలేటి, శ్రీనివాస్ గౌడ్, ఎసిజిఓ కె.గణేష్ కుమార్, స్పెక్ట్ర ఐఐటి కృష్ణ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు సురభి శ్రీనివాస్ రావు, మహిపాల్ రెడ్డి, హరిప్రసాద్, ఆర్.శ్రీనివాస్, వ్యాఖ్యాత బైరోజు చంద్ర శేఖర్, ఉపాధ్యాయులు షఫీ, రాజేంద్రచారి, చిత్ర, మద్దిలేటి, ప్రవీణ్, భాస్కర్ వివిధ విద్యాసంస్థల అధినేతలు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




టాలెంట్ టెస్ట్‌లో మాట్లాడుతున్న జి. చిన్నారెడ్డి

## ఆపదలో తోడుగా షీ టీం

SHE TEAM

For You...With You...Always...

- మహిళలు, బాలికలకు భద్రత
- మేమున్నామంటూ భరోసా..
- విద్యాసంస్థలు, రద్దీ ప్రాంతాల్లో నిరంతర నిఘా
- డిసెంబర్ నెలలో 23అవగాహన కార్యక్రమాలు
- వేధింపులకు గురైతే

కాల్ : 8712659365 లేదా డయల్ 100

- క్షణాల్లో షీ టీం మీ ముందు : ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 5, ప్రభాతవార్త:** ఆడ బిడ్డలు బయటకు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితులు వచ్చాయి. విద్యాలయాలు, షాపింగ్ మాల్స్, బస్టాండ్‌లు, రద్దీ ప్రాంతాలు, మహిళలు పని చేసే ఆఫీసుల్లో, ఆఖరికి బాలికల హాస్టల్ బాత్రూంలల్లో రక్షణ కరువయ్యే దుస్థితులు చూడాల్సి వస్తున్నది. ఇలాంటి పరిస్థితుల్లో మేమున్నామంటూ షీ టీం భరోసానిస్తున్నది. మీ భద్రత మా బాధ్యత అంటూ కొండంత ధైర్యం చెబుతున్నారు. ఎక్కడైనా ఆకతాయిలు వేధిస్తే డయల్ 100 లేదా 8712659365 నెంబర్‌ను సంప్రదించాలని ఎస్పీ జానకీ సూచిస్తున్నారు. మహిళలు, బాలికలు, విద్యార్థినిలు వేధింపులకు గురైనట్లు అయితే వెంటనే జిల్లా షీ టీమ్ నెంబర్ 8712659365 లేదా డయల్ 100




మహబూబ్‌నగర్‌లో కళాశాలలో అవగాహన కల్పిస్తున్న డిఎస్‌పి

కు ఫిర్యాదు చేసినచో వారిపైన చట్టపరమైన చర్యలు తీసుకుంటారు. డిసెంబర్ నెలలో జిల్లాలో షీ టీమ్ సిబ్బంది మహిళలను, విద్యార్థినులను వేధిస్తున్న పోకిరీలను అదుపులోకి తీసుకొని వారి తల్లిదండ్రులు సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహిస్తారు. డిసెంబర్ నెలలో వచ్చిన 4ఫిర్యాదులు రాగా వాటిలో 3కౌన్సిలింగ్ నిర్వహించారు. ఇద్దరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకోగా ఒకటి ఎఫ్ఐఆర్ చేశారు. ఒక్క డిసెంబర్ నెలలోనే 23అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లాలోని 65 హాట్ స్పాట్లను సందర్శించి అక్కడి పరిస్థితులపై ఆరా తీశారు. జిల్లాలో ఉన్న షీ టీమ్స్ బృందాలు ప్రభుత్వ కళాశాలలో,, ప్రభుత్వ పాఠశాల ల్లో, తెలంగాణ మోడల్ స్కూళ్లలో, రెసిడెన్షియల్ స్కూల్ లలో కేజీబీ వీ స్కూళ్లలో విద్యార్థిని విద్యార్థులకు ర్యాగింగ్/ ఇవిటీజింగ్/ పోక్సో/ షీ టీమ్స్/ యాంటీ హ్యూమెన్ ట్రాఫికింగ్ లపై నిత్యం అవగాహన కల్పిస్తున్నారు. మహిళలు, బాలికల రక్షణ గురించి తెలంగాణ రాష్ట్రంలో ప్రత్యేకంగా షీ టీమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది. మహిళలు, బాల బాలికలు, విద్యార్థిని విద్యార్థులకు రక్షణగా నిలుస్తూ సేవలు అందించ డం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలో షీ టీమ్స్ ప్రత్యేక గుర్తింపు పొందింది. మహిళలు బాలికలు విద్యార్థినిలు షీటీమ్స్ సేవలు విని యోగించుకోవాలి. ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలు అందిం చేందుకు షీ టీం సిద్ధంగా ఉన్నది. వేధింపులకు గురయ్యే మహిళలు షీటీమ్‌కు ఫిర్యాదు చేయదలచుకునే మహిళలు ఈ అవకాశాన్ని విని యోగించుకోవాలి. మహిళల వివరాలు గోప్యంగా ఉంచబ డతాయని అంతే కాకుండా మహిళలు అత్యవసర పరిస్థితుల్లో డయల్100కు కాల్ చేసి తక్షణ పోలీస్ సహాయం పొందాలని ఎస్పీ సూచించారు.

### ఒక్క కాల్ చేయండి



ఎవరైనా ఆకతాయిలు వేధిస్తే ఇబ్బందులకు గురి చేస్తే వెంటనే డయల్ 100కు ఫిర్యాదు చేయాలి. ఫిర్యాదు చేసిన వారి వివరాలు ఎట్టిపరిస్థితుల్లోనే బయటి వ్యక్తులకు తెలియపర్చము. కేసు తీవ్రతను బట్టి కౌన్సిలింగ్ ఇవ్వడం ఎపెఫ్ఐఆర్ నమోదు, అరెస్ట్ చేయడం లాంటివి చేస్తాం. డిసెంబర్ నెలలో వివిధ ప్రాంతాల్లో 23అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం.

*- జానకీ ధరావత్, ఎస్పీ మహబూబ్‌నగర్*

### డిసెంబర్-2024 షీ టీం కార్యక్రమాలు

| | |
|---|---|
| అవగాహన కార్యక్రమాలు | : 23 |
| హాట్ స్పాట్ సందర్శన | : 65 |
| ఫిర్యాదులు | : 04 |
| కౌన్సెలింగ్ | : 03 |
| రెడ్ హ్యాండెడ్ | : 02 |
| ఎఫ్ఐఆర్ | : 01 |



పాల్గొన్న విద్యార్థులు

## ఏడాదిలో 7సార్లు కౌన్సిల్ సమావేశాలు

### రూ.120 కోట్ల అభివృద్ధి పనులకు నిధులు

### అభివృద్ధికి ఎన్నిసార్లయినా సీఎంను కలుస్తాం

### మహబూబ్‌నగర్ మన అందరిది:

### ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 5 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మనందరిదని, పార్టీలకు అతీతంగా అభివృద్ధి చేయడమే తమ అజెండా అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎంవిఎస్ జూనియర్ కళాశాలలో జరిగిన శ్రమదానం కార్యక్రమంలో ఆయన పాల్గొని పలు అభివృద్ధి పనులకు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. జూనియర్ కళాశాల తరగతి గదులను ఆయన పరిశీలించారు. తరగతి గదుల పై భాగంలో పాడైన రేకులను వెంటనే తొలగించి, నూతన రేకులను అమర్చాలని , అవసరమైన తరగతి గదులకు స్లాబ్ వేయించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. రెండు పార్కులను, వాకర్స్ కోసం వాకింగ్ ట్రాక్ ఏర్పాటు కోసం ఎస్టిమేషన్స్ తయారు చేయాలని ఆయన ముడా, మున్సిపల్ చైర్మన్ లకు సూచించారు. అలాగే విద్యార్థుల మీటింగ్ కోసం ఏర్పాటు చేసిన వేదిక దగ్గర షెడ్ నిర్మాణాన్ని వెంటనే పూర్తిచేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతి ఆదివారం శ్రమదానం అనే కార్యక్రమాన్ని చేపట్టి మన పట్టణంలో మన చుట్టూ ఉన్న ప్రభుత్వ కళాశాలల్లో, హాస్టల్స్ లో మానాయకులు, కార్యకర్తలు అభిమానులతో కలిసి శ్రమదానం చేస్తున్నామన్నారు. మాదృష్టికి వచ్చే ఏ సమస్య అయినా సరే కొన్నింటిని అక్కడికి అక్కడే పరిష్కారం చేస్తున్నామని, కొన్ని సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్ళి ప్రణాళికలు అందిస్తున్నాం అని అన్నారు. అధికారులు చాలా మంచిగా తమ పరిధిలో పనిచేస్తున్నారన్నారు. ప్రజలు - మిగతా4లో..



తరగతి గదులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

## ప్రాజెక్టుల నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం

**గద్వాల, జనవరి 5 ప్రభాతవార్త :** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు గద్వాల మండల పరిధిలోని రేకులపల్లిలో వ్యవసాయ భూములు కోల్పోయిన రైతులకు ప్రభుత్వం తరఫున వచ్చిన నష్ట పరిహారం ఆర్థిక సహాయ చెక్కులను ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అందించారు. 46 మంది రైతులు భూములు కోల్పోతే మూడో విడతగా 23 మంది రైతులకు 1,95,23,960 రూపాయలు నష్టపరిహారం ప్రభుత్వం తరఫున లబ్ధిదారులకు చెక్కులను అందించిన ఎమ్మెల్యే పంపిణి చేశారు. లోయర్ జూరాల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో కృష్ణమ్మ వరదలతో ముంపుకు గురైన రేకులపల్లి గ్రామం సమీపంలోని జెన్కో దగ్గర 67 ఎకరాల వరకు రైతులు తమ భూములను కోల్పోవడం జరిగిందని దాదాపుగా 46 మంది రైతులు తమ భూములను త్యాగం చేసి జెన్కో లో విద్యుత్ ఉత్పత్తికి సహకరించినందుకే నేడు ప్రజలకు నాణ్యమైన కరెంటు సరఫరా కావడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు భూమిని ఎంతో పెద్ద మనసుతో ఆనాడు భూమిని ప్రభుత్వానికి ఇవ్వడం జరిగింది. కావున జెన్కో అధికారులతో పలుమార్లు కలిసి మాట్లాడి భూమిని కోల్పోయిన రైతులను ఆదుకోవాలని వారికి ఏదో రూపంలో ప్రభుత్వం వారికి నష్టపరిహారం అందించాలని కోరడం జరిగిందన్నారు. ఈ మేరకు ప్రభుత్వం భూములు కోల్పోయిన రైతుకు ప్రతి ఎకరానికి ఏడు లక్షల రూపాయలు కేటాయించడం జరిగిందన్నారు. ఏడు లక్షల రూపాయలు కూడా తక్కువని ప్రస్తుత భూమి విలువ ధర 30, 40 లక్షల రూపాయలు ఉందన్నారు. మీ త్యాగం ఎన్నటికీ, ఎప్పటికీ మరువలేనని కొనియాడారు. నేడు మూడో విడతలో భాగంలో రేకులపల్లి గ్రామానికి చెందిన రైతులకు 23 మందికి అక్షరాలా ఒక్క కోటి తొంబై ఐదు లక్షల ఇరవై మూడు వేల తొమ్మిది వందల అరవై రూపాయలు ప్రభుత్వం తరఫున ఆర్థిక సహాయం అందించడం జరిగింది. అదేవిధంగా మిగిలిన రైతులకు త్వరలోనే వస్తాయని తెలిపారు. మీ త్యాగం వల్లనే నేడు విద్యుత్, సాగునీటి సరఫరా అవుతుందని కావున గద్వాల నియోజకవర్గ ప్రజల తరఫున మీకు ధన్యవాదాలని రైతులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, జమ్ములమ్మ ఆలయ చైర్మన్ వెంకట్రాములు, కౌన్సిలర్ నరహరి శ్రీనివాసులు, మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, మాజీ జెడ్పిటిసి రాజశేఖర్, మాజీ దేవాలయ చైర్మన్ సతీష్, సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, గోపి రెడ్డి, హనుమంత్ రెడ్డి, కురుమన్న, గోవిందు, ధర్మానాయుడు, కాంబ్లె, నాగేంద్ర యాదవ్, రామాంజనేయులు, ఎస్‌విఆర్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



రైతులకు చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

## ఆర్డీయస్ రైతులకు తప్పని సాగునీటి కష్టాలు..



కాలువలో దిగి నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు, రైతులు

**గద్వాల, జనవరి5 ప్రభాతవార్త:** ఆర్డీయస్‌కు నీళ్ల వెంటనే విడుదల చేయాలని, కర్ణాటక రైతులు అక్రమంగా నీటిని తోడేస్తున్నారుని బీజేపీ జిల్లా అధ్యక్షులు రామచంద్రరెడ్డి తెలిపారు. 11రోజులవుతున్న ఆర్డీయస్‌కు నీళ్లు రాని పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. తుంగభద్ర డ్యామ్‌లో దాదాపు 1628అడుగుల ఎత్తులో నీళ్ల ఉన్నా కానీ, ఇండెంట్ ప్రకారం రావలసిన వాటా 15.9టీఎంసీల నీళ్ల అసలు రాకపోవడంతో రైతులు తమ పొలాల్లో వేసుకున్న వరి, మొక్కజొన్న ఇతరపంటలు వాడిపోతున్నారు. ఇక రెండురోజులు నీళ్ల రాకపోతే పంటపూర్తిగా నాశనమై రైతులు నష్టపోతారన్నారు. అంతేకాక అలంపూర్ నియోజకవర్గంలో ఉన్న ఆర్డీఎస్ ఆయకట్టు రైతులు రబీలో సాగు చేసుకున్న మొక్కజొన్న, మిర్చి, పొగాకు, వేరుశనగ మొదలైన పంటలకు నీటితడుల ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. గత డిసెంబర్ 26న కర్ణాటకలో ఉన్న తుంగభద్ర డ్యాం నుంచి ఆర్డీఎస్ నీటి వాటాలో 1.078 టీఎంసీల నీటిని విడుదల చేస్తే మరి ఇంత వరకు ఎందుకు రాలేదని ఆయన ప్రశ్నించారు. ఎగువ నుంచి వచ్చిన నీటిని కర్ణాటక రైతుల అక్రమంగా తోడేస్తున్నారన్నారు. తుమ్మిల్ల ఎత్తిపోతల పథకం ద్వారా ఆర్డీయస్‌కు వచ్చే నీళ్ల కూడా రావడంలేదన్నారు. దీంతో రైతులు రబీలో సాగుచేసిన పంటలు ఎండే ప్రమాదం ఉందన్నారు. మరి ఇక్కడ ఉన్నటువంటి స్థానిక ఎమ్మెల్యే కానీ, ఎమ్మెల్సీ, కాంగ్రెస్ నియోజకవర్గం నాయకులు, ఇంచార్జ్ కానీ పట్టించుకోవడం లేదన్నారు. రైతుల పరిస్థితులను ఆర్డీయస్ ఆయకట్టు కింద పట్టించుకునే నాథుడే కరువయ్యారన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో జాయింట్ ఇండెంట్ వాటా నీళ్ల కలిసి సుంకేసుల, ఆర్డీయస్ కు వచ్చేవి, కానీ మరి ఈరోజు ఆ పరిస్థితి లేదన్నారు. ఏపీ ప్రభుత్వం కర్ణాటకలో ఉన్న హెచ్.ఎల్.సి, ఎల్.ఎల్.సి కాలువలకు కె.సి కెనాల్ వాటాను విడుదల చేయించుకుంటున్నారు. దీంతో తెలంగాణ రైతులు తీవ్రంగా నష్టపో తున్నారన్నారు. మరి తెలంగాణకాంగ్రెస్ ప్రభుత్వం ఏపీ ప్రభుత్వంతో చర్చించి రెండు వాటాలు ఒకేసారి విడుదల చేయించే విధంగా చర్యలు తీసుకుంటే జాయింట్ వాటా కలిసి సుంకేసుల, ఆర్డీయస్‌కు వచ్చే అవకాశం ఉందన్నారు. అంతేకాక పక్కన ఉన్న కర్ణాటకరాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలో ఉంది, ఈరాష్ట్రంలో కూడా అదే పార్టీ అధికారంలో ఉంది, కానీ కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ రాష్ట్రంలోని రైతులపై వివక్ష చూపడం సమంజసం కాదన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్రకార్యవర్గ సభ్యులు మేడికొండ భీమ్ సేన్ రావ్, వడ్డేపల్లి మండల అధ్యక్షులు నర్సింహులు, రాజోలి మండల అధ్యక్షులు సంజీవ రెడ్డి, అయిజ మండల అధ్యక్షులు గోపాల కృష్ణ, వడ్డేపల్లి పట్టణ అధ్యక్షులు రామకృష్ణ, అయిజ పట్టణ ప్రధాన కార్యదర్శి కంపాటి భగత్ రెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్ యాదవ్, వడ్డేపల్లి మండలం ఓబిసి మోర్చా అధ్యక్షులు వెంకటేష్ యాదవ్, అశోక్, పి.జె వెంకటేష్, శశి, రైతులు పాల్గొన్నారు.

## మక్తల్ మార్కెట్ యార్డ్‌కు పూర్వ వైభవం తీసుకురావాలి : ఎమ్మెల్యే



మార్కెట్ కమిటి డైరెక్టర్లను సన్మానించిన ఎమ్మెల్యే

**మక్తల్, జనవరి 5 ప్రభాతవార్త:** మక్తల్ మార్కెట్ నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో రైతు సంక్షేమం కోసం కృషి చేయడంతో పాటు మార్కెట్ యార్డుకు పూర్వ వైభవం తీసుకురావాలని మక్తల్ ఎమ్మెల్యే డా. వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. ఇటీవల మక్తల్ మార్కెట్ కమిటీ చైర్ పర్సన్‌గా బాధ్యతలు చేపట్టిన గవినోళ్ల రాధా లక్ష్మారెడ్డి, వైస్ చైర్మన్ గణేష్ కుమార్‌తో పాటు డైరెక్టర్లను ఆదివారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పూల మాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో మక్తల్ మార్కెట్ యార్డులో ధాన్యం, వేరుశనగ, పెసర్లు, కందుల వంటి ప్రధాన పంటల క్రయవిక్రయాలు జోరుగా సాగుతుండేవన్నారు. అయితే కాలక్రమంలో మార్కెట్ యార్డు పూర్తిగా దీనావస్థకు చేరి రైతులు తమ పంటలను ఇతర ప్రాంతాలకు తీసుకుపోయే దుస్థితి ఏర్పడిందన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని నూతన పాలకవర్గం ఆధ్వర్యంలో ప్రతి రైతు పండించిన పంటను ఇక్కడే అమ్ముకునేలా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి జి. లక్ష్మారెడ్డి, నాయకులు కావలి శ్రీహరి, ఆనంద్ గౌడ్, కావలి తాయప్ప, రవీందర్, డైరెక్టర్లు విష్ణువర్ధన్ రెడ్డి, రంజిత్ రెడ్డి, శాలం, ఫయాజ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అరాచక పాలన సాగిస్తుంది

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి

**వనపర్తి క్రైమ్ జనవరి 5 ప్రభాతవార్త :** బి.ఆర్.ఎస్ పార్టీ కార్యనిర్వహక అధ్యక్షులు కె.టి.ఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ,మాజీ ఎం.పి రావుల చంద్రశేఖరరెడ్డి మాజీ ఎమ్మెల్యే ఆల.వెంకటేశ్వర్ రెడ్డి ఆదివారం భారత రాష్ట్ర సమితి ప్రధాన కార్యాలయం హైదరబాద్ నందు మాజీ మంత్రి వర్కింగ్ ప్రసిడెంట్ కె.టి.ఆర్ ని కలసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి రావుల చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రధాన ప్రతి పక్షనేత కాంగ్రెస్ పార్టీ సాగిస్తున్న అరాచక, అవినీతి, నిర్బంధ పాలనను ఎప్పటికప్పుడు నిలదీస్తూ ప్రజల పక్షాన పోరాడుతూ అదే సమయములో బి.ఆర్.ఎస్ పార్టీ శ్రేణులకు నూతన ఉత్తేజాన్ని ,ఆత్మస్థైర్యాన్ని కలిగిస్తూ పార్టీని కొత్త పుంతలు తొకిస్తున్న కె.టి.ఆర్ నాయకత్వం స్పూర్తిదాయకం అని అన్నారు. రాబోవు కాలంలో కె.టి.ఆర్ నాయకత్వములో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా మరింత అభివృద్ధి చెందాలని కోరుకుంటూ కె.టి.ఆర్ కి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు.



కె.టి.ఆర్ కు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ మంత్రి, మాజీ ఎంపీ, మాజీ ఎమ్మెల్యే

## గొల్లవాగు కత్వను చేపల చేరువుగా ఏర్పాటు చేయండి

**ఉప్పునుంతల, జనవరి 5 ప్రభాతవార్త :** మండలంలోని పెద్దాపుర్ గ్రామ సమీపంలో ఉన్న గొల్లవాగు కత్వను చేపల చేరువుగా ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు కొత్త రవీందర్‌రావు కోరారు. దీంతో మత్స్యకారుల కుటుంబాలకు జీవనోపాధి ఏర్పడుతుందని, లక్ష్మాపూర్ వెంకటేశ్వర చెరువుకు సంబంధించి పెద్దాపుర్ గ్రామంలో కొంతమంది మత్స్యకారులకు మాత్రమే సభ్యత్వం ఉందని, పెద్దాపూర్ గ్రామ సమీపంలో ఉన్న గొల్లవాగు కత్వను చేపల చేరువుగా ఏర్పాటు గ్రామంలో ఉన్న మత్స్యకారులకు జీవనోపాధి ఏర్పడుతుందని, కత్వ సమీపంలో భూమి ని రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి అట్టి భూమిని ప్రభుత్వ అధినంలో కి తీసుకొని మత్స్యకారులు చేపలు పెంచడానికి వసతులు కల్పించి వారికి జీవనోపాధి కల్పించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.



పెద్దా పూర్ సమీపంలో ఉన్న గొల్లవాగు

## డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడ్ని కలిసిన జిల్లా రెవెన్యూ సంఘం నాయకులు

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ల సంఘం అధ్యక్షుడు అలాగే తహాశీల్దార్ల సంఘం వ్యవస్థాపకులు, లచ్చిరెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లో టిజిటిప కార్యాలయంలో జోగులాంబ గద్వాల జిల్లా రెవిన్యూ సీనియర్ అసిస్టెంట్ల సంఘం నాయకులు కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా రెవెన్యూ వ్యవస్థ పూర్వవైభవానికి అదే విధంగా ధరణి స్థానంలో భూ భారతి ఏర్పాటు చేసి రైతుల సమస్యల పరిష్కారాలకు చొరవచూపే దిశలో లచ్చిరెడ్డి కృషి మరువలేనిదని భూ భారతి ద్వారా రైతులకు మరిన్ని ప్రయోజనాలు కలుగుతాయని డిప్యూటీ కలెక్టర్ల సంఘంనాయకుడు లచ్చిరెడ్డిని వారు అభినందించారు. ఈ కార్యక్రమంలో టీజీఆర్ఎస్ప సంఘం రాష్ట్రసభ్యులు ప్రశాంత్ గౌడ్, జిల్లా అధ్యక్షులు కరుణాకర్, ప్రధాన కార్యదర్శి అజిత్ కుమార్, మీడియాకార్యదర్శి గురురాజ్, సాంస్కృతిక కార్యదర్శి మదన్‌మోహన్, నిది మెంబర్లు శ్రీనివాసులు, కఫీల్ అహ్మద్, వెంకటపతి నాయుడు ఉన్నారు.



తెలంగాణ డిప్యూటీ కలెక్టర్ సంఘం అధ్యక్షుడ్ని కలసిన రెవెన్యూ సీనియర్ అసిస్టెంట్ల సంఘం నాయకులు

## ఫామ్ ఫండ్‌లో నీట మునిగి వ్యక్తి మృతి

**బిజినేపల్లి, జనవరి5 ప్రభాతవార్త :** నంది వడ్డేమాన్ గ్రామానికి చెందిన గుంటి బంగారయ్య (45) తన సొంత వ్యవసాయపొలంలో ఫామ్‌ఫండ్‌లో నీట మునిగి మృతిచెందాడు. శనివారం రాత్రి బంగారయ్య ఇంటి నుండి వ్యవసాయ పంట పొలానికి సాగు నీరు అందించేందుకు పొలానికి వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు. ఆదివారం ఎంతకీ ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వ్యవసాయ పంట పొలం వద్దకు వెళ్లి చూడగా ఫామ్ ఫండ్ లో నీట మునిగి మృతి చెంది ఉన్నట్లు వివరించారు. బోరు మోటరు నడవకపోవడంతో నీటిలో ఉన్న ఫుట్బాల్ సరిచేసే క్రమంలో ఫామ్ ఫండ్ లో దిగేందుకు కట్టుకున్న తాడు తెగిపోవడంతో నీట మునిగి మృతి చెంది ఉంటాడని కుటుంబీకులు తెలిపారు. ఈత రాకపోవడం వల్లే నీటిలో మునిగి మృతి చెంది ఉంటాడని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. మృతుడికి భార్య జయమ్మ ఇద్దరు కొడుకులు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

## రాష్ట్ర స్థాయిలోనూ రాణించాలి..

**మక్తల్, జనవరి 5 ప్రభాతవార్త:** ఈ నెల 7న హైదరాబాదులోని దోమలగూడ లో జరిగే షూటింగ్ బాల్ రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ నారాయణపేట జిల్లా క్రీడాకారులు విశేషంగా రాణించి జిల్లాకు పేరు ప్రఖ్యాతలు తీసు కురావాలని షూటింగ్ బాల్ అసోసియే షన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి. గోపాలం అన్నారు. మక్తల్ మినీ స్టేడియం గ్రౌండ్ లో జిల్లా స్థాయి సీనియర్ షూటింగ్ బాల్ మహిళలు, పురుషుల జట్ల ఎంపికలను ఆదివారం ఆయన ప్రారం భించారు. ఈ సందర్భంగా జిల్లాలోని అన్ని మండలాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభను కనబరిచారు. కార్యక్రమంలో పీడీలు మీనా కుమారి, రేణుక, పీఈటీలు శ్రీవాణి, అమ్రేష్, రమేష్, శ్రీలత, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర స్థాయి పోటీలకు మహిళల విభాగంలో వైష్ణవి ,మేఘ వర్ష, మనీషా, తేజస్విని, నవ్య శ్రీ, ఐశ్వర్య ,శ్రీలత, రేణుక, అరుణ ఎంపికయ్యారు. పురుషుల విభాగంలో రమేష్, విష్ణు అనిల్ , శివరాజ్, సందీప్, చంద్రశేఖర్, రవి, శివకుమార్, శంకర్ ఎంపికయ్యారు.



రాష్ట్రస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

## మాజీ ఎంపీని పరామర్శించిన శ్రీధర్ రెడ్డి

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** నాగర్ కర్నూల్ పార్లమెంట్ మాజీ సభ్యులు మంద జగన్నాథం అనారోగ్యానికి గురై హైదరాబాదులోని నిమ్స్ ఆస్పత్రిలో గత 10రోజులుగా చికిత్స పొందుతున్నాడు. ఈ సందర్భంగా ఇటిక్యాల మాజీ ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి మాజీ ఎంపీ మంద జగన్నాథంను ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆయన తనయుడు మంద శ్రీనాథ్‌తో మాట్లాడి ఆరోగ్య విషయాలను అడిగి తెలుసుకున్నారు.



మంద జగన్నాథంను పరామర్శించిన శ్రీధర్ రెడ్డి

# అధ్వాన్నంగా మారిన చాగాపురం శాంతినగర్ రహదారి

**3 ఏళ్లుగా గుంతల మయంగా మారిపోయిన బీటి రోడ్డు**

**గుంతలు పడ్డ రోడ్డుపై ప్రజల ప్రయాణం నరకం**

**మరమ్మత్తులు చేయించేందుకు ఆసక్తి చూపని ప్రజా ప్రతినిధులు, అధికారులు**

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ నుండి చాగాపురం, రామాపురం, జిల్లేడుదీన్నే, శాంతినగర్ వరకు కూడా దాదాపు 20 కిలోమీటర్ల మేర దూరం బీటి రోడ్డు పాడైపోయి గుంతల మయంగా మారిపోయింది. అడుగుకో గుంతగా మారిన ఈ రోడ్డుపై ప్రజలు ద్విచక్ర వాహనాలలో,ఆటోలలో అవస్థలు పడుతూ ప్రయాణించి నరకయాతన అనుభవిస్తున్నారు. పై గ్రామాలకు వెళ్లే బీటి రోడ్డు పాడైపోయి 3 సంవత్సరాలు అవుతున్న అలంపూర్ నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదని గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు అది చేస్తాం. ఇది చేస్తాం అని చెప్పి ఓట్లు వేయించుకొని ఎన్నికల్లో గెలిచిన ఆ సమస్యలు పూర్తి చేయడంలో ప్రజా ప్రతినిధులు మరచిపోతున్నారు. ఇటిక్యాల రైల్వే స్టేషన్ నుండి చాగాపురం. రామాపురం. జిల్లేడు దీన్నే. శాంతినగర్ వరకు బిటి రోడ్డు పాడైపోవడంతో ఆ రోడ్డుకు కనీసం మరమ్మత్తులు పనులు కూడా చేయించకపోవడంతో పగలు పాడైపోయిన ఈ రహదారిపై వెళ్లాలంటే అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళల్లో అయితే కిందపడి గాయాల పాలవుతూ గత్యంతరం లేక ఈ రోడ్డుపైన ప్రయాణిస్తున్నారు. రోడ్డు అధ్వానంగా మారిపోవడంతో గద్వాల ఆర్టీసీ డిపో నుండి ఈ రహదారిపై శాంతినగర్ వరకు బస్సు తిరగడం లేదు. అదేవిధంగా పాడైపోయి అడుగుకో గుంతగా మారిపోయిన ఈ రహదారికి కనీస నిర్వహణ లేక మరమ్మత్తులకు నోచుకోక గుంతలను పూడ్చకపోవడంతో అత్యంత ప్రమాదకరంగా పారిపోయింది. ఈ రోడ్డుపై ప్రతినిత్యం పై గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రానికి అలాగే కళాశాలలకు, పాఠశాలలకు, హైదరాబాద్, కర్నూల్ కు రైలులో ప్రయాణించేందుకు కూడా శాంతినగర్, రాజోలి అలాగే పై గ్రామాల నుండి కూడా వాహనాలపై ప్రయాణిస్తుండగా అంతేకాక రైతులు పండించిన ధాన్యాన్ని జిల్లా కేంద్రానికి తరలించాలన్న ప్రజలకు భారంగా మారిపోయింది. వ్యవసాయ పొలాలకు ఆటోలలో కూలీలను తరలిస్తుండగా వారు సైతం నరకయాతన అనుభవిస్తున్నారు. ఈ రహదారి గుంతల మయంగా మారిపోయి సంవత్సరాలు గడుస్తున్న రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రభుత్వాలు. పాలకులు మారిన గ్రామాలకు సురక్షితంగా వెళ్లేందుకు రోడ్ల స్థితిగతులు మాత్రం మారడం లేదని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు. సంబంధిత శాఖ అధికారులు పట్టించుకోని గుంతల మయంగా మారిపోయిన చాగా పురం శాంతినగర్ బిటి రోడ్డుకు మరమ్మత్తు పనులు చేపట్టాలని గ్రామాల ప్రజలు వేడుకుంటున్నారు.



రోడ్డు గుంతల మయంగా మారడంతో ఖాళీగా వెళ్తున్న ఆటో

## ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది

### శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి

**బిజినేపల్లి, జనవరి 5 ప్రభాతవార్త :** ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది ఈ మాసమంటే విష్ణుమూర్తికి చాలా ప్రీతికరం అని శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. వట్టెం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలో రామానుజ జీయర్ స్వామి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. అనంతరం ఆదివారం ఉమ్మడి జిల్లా వికాస తరంగిణి సభ్యుల సమావేశంలో పాల్గొన్నారు. శ్రీ త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి మాట్లాడుతూ సూర్యుడు ధనురాశిలో ప్రవేశించి మళ్ళీ మకర రాశికి వచ్చేవరకూ ఉండే ముప్పైరోజులను ధనుర్మాసం అంటారని వివరించారు. నెలరోజులు తెల్లవారు ఝామునే లేచి స్నానం చేసి విష్ణుమూర్తిని, ఆయన అవతారమైన శ్రీ కృష్ణుణ్ణి పూజించడం అనాదిగా వస్తున్న ఆచారం అని తెలిపారు. ద్వాపర యుగంలో కృష్ణుని అనుగ్రహం పొందటానికి గోపికలు యమునా నదీ తీరానికి వెళ్ళి ఆవు పేడతో గొబ్బెమ్మలను తయారుచేసి కాత్యాయనీ దేవిని ఆహ్వానిస్తూ వ్రతం చేసే వారు అని చెప్పారు. అలాగే చిన్నతనం నుంచీ విష్ణుమూర్తిని భక్తితో పూజిస్తూ ఉండే గోదాదేవి కూడా ఈ నెలంతా ధనుర్మాసం వ్రతం జరిపి శ్రీహరి అనుగ్రహం పొందింది అని వివరించారు. అందుకని విష్ణుభక్తులంతా ఈ నెల రోజులు పండగ జరుపుతారన్నారు. సూర్యుడు ధనూరాశిలో ఉన్నప్పుడు ఉష: కాలంలో శ్రీ మహావిష్ణువుని ఒక్క రోజు పూజించినా వెయ్యి సంవత్సారాల పూజ ఫలితం ప్రాప్తిస్తుంది అన్నారు. ఈ మాసం లో చేసే నదీ స్నానం, సముద్ర స్నానం అశ్వమేధ యాగం తో సమానమైనది పురాణాల ఆధారం గా తెలుస్తుంది అని వివరించారు. ధనుర్మాసం లో ఉదయం సాయంత్రం ఇల్లు శుభ్రం చేసుకొని దీపారాధన చేయడం వలన శ్రీ మహాలక్ష్మి కరుణా కటాక్షాలు లభిస్తాయి అని తెలిపారు. కార్యక్రమంలో దేవాలయ ధర్మకర్త సందడి ప్రతాపరెడ్డి, సభ్యులు గుబ్బ సత్యనారాయణ, తూము రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామానుజ జీయర్ స్వామి

## సిపిఐ పటిష్టతతో కష్టజీవుల బతుకులు బాగు

**వనపర్తి క్రైమ్ జనవరి 05 ప్రభాతవార్త :** సిపిఐ పటిష్టతతోనే కష్టజీవుల బతుకులు బాగుపడతాయని, పార్టీలో చేరాలని సిపిఐ పట్టణ కార్యదర్శి జె.రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం సిపిఐ వనపర్తి పట్టణ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పానగల్ మండలం కేతేపల్లికి చెందిన 94 ఏళ్ల సిపిఐ వృద్ధనేత పి.కిష్టయ్య భగత్ సింగ్ నగర్ లో ప్రారంభించారు. జయమ్మకు పార్టీ సభ్యత్వం అందించి రుసుము సేకరించారు. ఈ సందర్భంగా సిపిఐ పట్టణ కార్యదర్శి జె రమేష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోపాలకృష్ణ మాట్లాడారు. 1925 డిసెంబర్ 26న సిపిఐ ఆవిర్భవించి 100 ఏళ్ళు అవుతుందన్నారు. అధికారంలోకి రాకపోయినా ప్రజల పక్షాన ఎర్రజెండా పోరాటం వల్లే సజీవంగా ఉందన్నారు. రైతులకు రుణమాఫీ, పేదలకు భూముల పంపిణీ, నిరుపేదలకు ఇండ్లు, ఇండ్ల స్థలాలు, ఆసరా పింఛన్లు రేషన్ కార్డులు సిపిఐ పోరాట ఫలితంగానే లభించాయన్నారు. రైతులకు గిట్టుబాటు ధర, కార్మికులకు కనీస వేతనం, వ్యవసాయ కూలీలకు కనీస కూలీ కోసం పోరాడుతోందన్నారు. సిపిఐ పోరాటంతోనే కూలీలకు ఉపాధి హామీ పథకం తెచ్చారన్నారు. ప్రజా పాలనలో స్వీకరించిన కొన్ని పోయినట్లు ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో తేలిందని, సర్వేలో వారిని పరిగణలోకి తీసుకోవాలన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. గిట్టుబాటు ధరకు చట్టబద్ధత కోసం ఢిల్లీలో పంజాబ్ రైతుల చేస్తున్న పోరాటానికి మద్దతు పలికారు. కార్మికులు కర్షకులు కూలీలు, ఉద్యోగులు మహిళలు సిపిఐ సభ్యత్వం స్వీకరించి సమస్యల పరిష్కారానికి పోరాడాలన్నారు. వృద్ధ నేత కిష్టయ్య, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పి కళావతమ్మ, నాయకులు లక్ష్మినారాయణ, చిన్న కురుమన్న, జయమ్మ, శిరీష, జ్యోతి, రవి తదితరులు పాల్గొన్నారు.



సిపిఐ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ప్రారంభించిన నేతలు

## చిన్నారుల సైన్స్ ఫెయిర్‌ను ప్రారంభించిన ఎంఈఓ

**గద్వాల, జనవరి 05 ప్రభాతవార్త :** విశ్వభారతి ఉన్నత పాఠశాలలో ఆదివారం రెండవ తరగతి లోపు చిన్నారుల సైన్స్ ఫెయిర్ ను గద్వాల మండల విద్యాధికారి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు. పాఠశాల కరెస్పాండెంట్ త్యాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాటాడుతూ విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఇలాంటి సైన్స్ ఫెయిర్‌లు దోహదం చేస్తాయి అన్నారు. ఉపాధ్యాయులు, తల్లి, తండ్రులు, చిన్న పిల్లలను తమ అభిరుచులకు తగ్గట్టుగా ప్రోత్సహించినట్లయితే, వారు ఉన్నత శిఖరాలకు చేరుకోవడానికి ఉపయోగపడుతాయన్నారు. సైన్స్ ఫెయిర్ లాంటి కార్యక్రమాలు చిన్నారుల సృజనశక్తికి పదును పెడుతుందని, ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థుల భవిష్యత్తులో ఉపయోగాలు ఉంటాయన్నారు. విశ్వభారతి పాఠశాలలో ఎల్‌కేజీ, యూకేజీ, మొదటి, రెండవ తరగతి విద్యార్థులు అద్భుతమైన ప్రతిభను కనపరిచారు. ఈ కార్యక్రమం లో పాఠశాల ప్రిన్సిపల్ రాఘసుధ, మిగతా ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్న పిల్ల సైన్స్ ఫెయిర్ ను పరిశీలన చేస్తున్న ఎంఈఓ

## సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు వెంటనే పరిష్కరించాలి

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** సమగ్ర శిక్ష ఉద్యోగుల డిమాండ్లు వెంటనే పరిష్కరించే విధంగా సీఎం రేవంత్ రెడ్డి చర్చకు పిలవాలని సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకట్రాంరెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారంతో నారాయణపేట జిల్లా కేంద్రంలో జరిగిన సమ్మె నేటితో నారాయణపేట జిల్లా కేంద్రంలోని ధర్నా సెంటర్ దగ్గర నేడు సమగ్ర శిక్ష ఉద్యోగులతో పాటు వారి పిల్లలు కూడా తమ నిరసనను తెలిపారు ఈ కార్యక్రమానికి సీపీఎం నారాయణపేట జిల్లా కార్యదర్శి వెంకట్రాంరెడ్డి మద్దతు పలికారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూతెలంగాణ సిద్ధిస్తే కాంట్రాక్ట్, ఔట్సోర్సింగ్ వ్యవస్థ ఉండదని అందరిని పర్మినెంట్ చేస్తామన్న టీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రకటించి తెలంగాణకు 10 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పరిపాలించిన కేసీఆర్ పట్టించుకోలేదన్నారు. ప్రజాపాలన అంటున్న ప్రస్తుత ముఖ్యమంత్రి వీరి సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును కూడా పాలకులు అపహాస్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను చర్చలకు పిలవాలి. వారిని విద్యశాఖలో విలీనం చేసి వారిని తక్షణమే పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.





ధర్నాలో సమగ్ర శిక్ష ఉద్యోగులు

## ప్రభుత్వం చర్చలకు ఆహ్వానించాలి : సీఐటీయూ

**అయిజ జనవరి 05 ప్రభాతవార్త :** ఐదు రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్న సివిల్ సప్లై హమాలీ కార్మికుల సమస్యలు పరిష్కరించేందుకు ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో హమాలీల జనరల్ బాడీ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ పౌర సరఫరా శాఖలో పనిచేస్తున్న సివిల్ సప్లై హమాలీ కార్మికులు ఐదు రోజులుగా నిరవధిక సమ్మెలో ఉన్నారని ప్రభుత్వం ఇప్పటివరకు కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించి, నూతన రేట్ల జీవోకు సంబంధించిన విడుదల చేయలేదని విమర్శించారు. ఒప్పందం చేసుకున్న హామీలను అమలు పరచకపోవడం అంటే కార్మిక వర్గం యొక్క ప్రజాస్వామిక హక్కులపై దాడి చేయడమేనని అన్నారు. ఉత్పత్తికి సంపదకు మూలమైన కార్మిక వర్గాన్ని విస్మరించిన నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వాలు కాల గర్భంలో కలిసిపోయాయని అన్నారు. కార్మికుల పట్ల ప్రభుత్వం తన వైఖరిని మార్చుకోవాలని లేని పక్షంలో కార్మిక వర్గ ఆగ్రహానికి గురి కావాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రభుత్వం నూతన రేట్ల కు సంబంధించిన జీఓ విషయంలో ఎందుకు ఆలస్యం చేస్తుందో అర్థం కావడం లేదని అన్నారు. సివిల్ సప్లై హమాలీ కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య బాధ్యత రాహిత్య విధానాలకు వ్యతిరేకంగా రేపు రాష్ట్రవ్యాప్తంగా తలపెట్టిన కలెక్టర్ కార్యాలయల ముట్టడి కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో హమాలీ కార్మికులు హాజరై జయప్రదం చేయాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఈశ్వర్, శ్రీనివాస్, పెదరాముడు ,నాగరాజు, భీమన్న ,విరేశ్ ,తిరుమల్ ,లక్ష్మన్న, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వం వెంటనే కార్మిక సంఘాలను చర్చలకు ఆహ్వానించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఏ.వెంకటస్వామి డిమాండ్ చేశారు

## టిటియు క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే యెన్నం



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్‌గర్, జనవరి 5 ప్రభాతవార్త:** తెలంగాణ టీచర్స్ యూనియన్ మహబూబ్‌నగర్ జిల్లా శాఖ క్యాలెండర్‌ను మహబూబ్‌నగర్ శాసన సభ్యులు యెన్నెం శ్రీనివాస్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రభుత్వం విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని పేర్కొంటూ, ఉపాధ్యాయులు పదవ తరగతి ఫలితాలలో జిల్లాని ముందు వరుసలో ఉండే విధంగా ప్రయత్నం చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో టిటియు జిల్లా అధ్యక్షులు జుర్రు నారాయణ యాదవ్ ,ప్రధాన కార్యదర్శి గుడిసె యాదయ్య, సోషల్ అధ్యక్షులు జనార్ధన్ రెడ్డి, ఉపాధ్యక్షులు రవికుమార్, జిల్లా కోశాధికారి విజయ్ మోహన్, జిల్లా కార్యదర్శులు బురాన్, నిరంజన్ ప్రచార కార్యదర్శి హన్మంతు, కార్యదర్శి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు ఆశీర్వదించిన ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల చిన్నారెడ్డి



**పెబ్బేరు జనవరి 5 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలం జానంపేట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు ఉమర్ కూతురి వివాహానికి ముఖ్యఅతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి హాజరై నూతన వధూవరులకు ఆశీర్వదించడం జరిగింది. కార్యక్రమంలో పెబ్బేరు పట్టణ అధ్యక్షుడు వెంకట్ రాములు యాదవ్, పెబ్బేర్ మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గౌని బుచ్చారెడ్డి, జిల్లా మత్స్య శాఖ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, రాంపురం సహదేవుడు, అనిల్ నాయుడు, కృపాకర్ రెడ్డి ,భాస్కర్, వెంకటేష్, పెద్దమందడి మండల్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు, తదితరులు పాల్గొన్నారు.

## పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



**మద్దూర్, జనవరి 5ప్రభాతవార్త:** మద్దూరు మండల కేంద్రంలోని జడ్పీ హైస్కూల్ లో 1994,95 సంవత్సరం లో టెన్త్ క్లాస్ చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం లో కలిశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని గ్రీన్ ప్యాలస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి చదువులు చెప్పిన ఉపాధ్యాయులకు శాలువాలతో సన్మానం చేశారు. ఒకరికి ఒకరు యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం అందరూ కలిసి విందు భోజనాలు చేశారు.

## కాంగ్రెస్ నేతను అభినందించిన ఎమ్మెల్యే



ఎం.మోతిలాల్‌నాయక్‌ను సన్మానిస్తున్న దృశ్యం

**వెల్దండ, జనవరి 5 ప్రభాతవార్త:** జిల్లా అభివృద్ధి సమన్వయ మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యులుగా ఇటీవల నియమితులైన మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం.మోతీలాల్‌నాయక్‌ను ఆదివారం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి శాలువా కప్పి అభినందలు తెలిపారు. పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ ఉన్నతికి, పార్టీ అభివృద్ధికి కష్టపడాలని కార్యకర్తలకు ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యులు శ్రీనివాస్ గౌడ్, భట్టు కిషన్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పర్వత్‌రెడ్డి, వెంకటేశ్వర్ గౌడ్, శేఖర్, శ్రీనివాస్‌యాదవ్ ,రాములుయాదవ్, గోపాల్ నాయక్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

## పఠనం మనిషిని పరిపూర్ణుడిని చేస్తుంది

**గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి**

**గద్వాల,జనవరి 5 ప్రభాతవార్త :** గద్వా ల జిల్లా కేంద్రంలోని అనంత ఫంక్షన్ హాల్ నందు డాక్టర్ లూయిస్ బ్రెయిలీ 216 జయంతి వేడుకల్లో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ లూయిస్ బ్రెయిలీ చిత్రప టానికి నివాళులు అర్పించి జ్యోతి ప్రజ్వలన చేశారు. అందుల అక్ష ర ప్రదాతను స్మరించుకుంటూ అయన జయంతి సందర్బంగా ఏ ర్పాటుచేసిన భారీ కేక్‌ను అందుల సమక్షంలో కట్ చేసి ఆనందాన్ని పంచుకున్నారు. అందులకోసం అక్షరాన్ని నిర్మించి వారి జీవితా ల్లో వెలుగులు నింపిన ప్రదాత డాక్టర్ లూయిస్ బ్రెయిలీ అన్నారు. ప్రతి మనిషికి కొత్త విషయం తెలుసుకోవడం అనేది మానవ నైజం అన్నారు. పఠనం మనిషిని పరిపూర్ణతను ఏర్పరుస్తుందని, ప్రతి విషయం పఠనం ద్వారానే ఏర్పడుతుందని,ఆ విషయం గ్రహించిన లూయిస్ బ్రెయిల్ స్వయంగా అందుడవడం వల్ల ప్రత్యేక విధానంలో చేతి వెళ్ళ స్పర్శతో అక్షరాలను చదివే విధానాన్ని కనుక్కొని కొన్ని కోట్ల జనాలకు అక్షర ప్రధాతగా నిలిచిన గొప్ప వ్యక్తి అన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సి లర్ పూడూర్ కృష్ణ, మాజీ గ్రంధాలయ చైర్మన్ జంబు రామన్ గౌడ్, మాజీ జడ్పీటీసీ రాజశేఖర్, సీనియర్ నాయకులు రమేష్ నాయుడు, గోవింద్, ప్రభాకర్ గౌడ్, ధర్మానాయుడు, నాగేంద్ర యాదవ్, రామాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



అంధ విద్యార్థుల చేత కేక్ కట్ చేయిస్తున్న ఎమ్మెల్యే

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ పంపిణీ

**వీపనగండ్ల జనవరి 5 ప్రభాతవార్త :** వీపనగండ్ల మండలంలోని తూముకుంట గ్రామానికి చెందిన కేశపాగ రవికి గుండె శస్త్ర చికిత్సకు కోసం అని సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా 1,50,000 అంద జేసినట్లు జూపల్లి కృష్ణారావు అనుచరులు మదన్మోహన్‌రావు , కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఆదివా రం నాడు అందజేసినట్లు రాంబా బు రామన్ గౌడు తెలియజేశారు. అయితే రవి చాలా రోజుల నుండి గుండె శస్త్ర చికిత్స కు సంబంధిం చి ఆర్థిక ఇబ్బందులు పడుతున్నా డని ఈ విషయాన్ని రాష్ట్ర ఎక్సై జ్,టూరిజం శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకుపోగా తక్షణమే ఆయన స్పందిస్తూ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయడం జరిగిందని వారు తెలిపారు. ఈ చెక్కును బాధితుని తండ్రి కేశపాగ కురుమయ్య కు అందివ్వడం జరిగిందని వారు ఈ సందర్భంగా తెలిపారు. ఈ చెక్కు అందజేసిన కార్యక్రమంలో చిన్న రాంబాబు ,రాజగోపాల్ ,తిరుపతయ్య తదితరులు ఉన్నారు.



సీఎం చెక్కు అందజేసిన మదన్ మోహన్‌రావు

## పండుగ సాయన్న సేవ పురస్కారం అందుకున్న తెలుగు తిరుమలేష్

**అమరచింత జనవరి 5 ప్రభాతవార్త :** అమరచింత పట్టణానికి చెందిన కవి రచయిత తెలుగు తిరుమలేష్‌కు ఆదివారం హైదరా బాదులో బషీర్బాగ్ ప్రెస్ క్లబ్లో నిర్వహించిన పండుగ సాయన్న రాష్ట్రస్థాయి సేవా పురస్కారం అందుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలో వివిధ సామాజిక సంస్థ ల్లో సేవలు అందిస్తున్న సామా జిక వేత్తలకు కవులకు కళాకారుల కు అభ్యుదయ వాదులకు పండు గ సాయన్న సేవా పురస్కారం అందజేస్తున్నారని అందులో భా గంగానే రచయిత కవి సామాజిక సేవలు అందించిన సందర్భంగా పండుగ సాయన్న సేవా పురస్కా రం అందుకోవడం సంతోషంగా ఉందని రచయిత కవి తెలుగు తిరుమలేష్ తెలిపారు. అమర చింత పట్టణానికి చెందిన తెలుగు తిరుమలేష్‌కు పండుగ సాయన్న సేవ పరిష్కారం అందుకో వడం అట్లా రచయితలు కవులు కళాకారులు అభ్యుదయ వాదులు హర్షం ప్రకటించారు.



పురస్కారం అందుకుంటున్న తిరుమలేష్

## అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడీ ముఠా పోలీస్ అదుపులో?

**అమరచింత డిసెంబరు 5 ప్రభాతవార్త :** ఉమ్మడి జిల్లాలో తీవ్ర సంచలనం ప్రకంపం సృష్టించిన అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడి ముట్టను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ అదుపులో ఉన్నట్లు సమాచారం. గత నెలలో యూనియన్ బ్యాంకు కు వరుస సెలవులు ఉండటంతో వనపర్తి జిల్లాలోని ఓ గ్రామానికి చెందిన ఓ కుటుంబం అమరచింత పట్టణంలో వారం రోజులుగా బ్యాంకు పరిసర పరిసరాలలో వారు రెక్కీ నిర్వహించినట్లు సమాచారం. అమరచింత యూనియన్ బ్యాంకు దోపిడీకి యత్నానికి ప్రయత్నించిన దోపిడి ముఠా పట్టణంలో అమరచింత పట్టణంలో ఓ పూజా కార్యక్రమానికి సంబంధించిన కూలీలుగా మారి బ్యానర్లు కట్టారని తెలుస్తుంది. అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడీ కి సంబంధం ఉందని అనుమానంతో పలువురు పాత నేరస్తులను అదుపులోకి తీసుకొని విచారించారు. అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడీ కేసును వనపర్తి జిల్లా ఎస్పీ రావుల గిరిధర్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని డాగ్ స్క్వాడ్ క్లూస్ టీం సహకారంతో బ్యాంకు దోపిడీ ముఠా కేసును చేదించినట్లు తెలుస్తుంది. అలాగే అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడీ యత్నానికి సూత్రధారి బీటెక్ చదువుకున్న మహిళా ఉన్నట్లు సమాచారం. అమరచింత యూనియన్ బ్యాంక్ దోపిడీకి పాల్పడిన వారిని సోమవారం పోలీసులు ప్రకటించే అవకాశం ఉందని తెలిసింది.

## బాలమణికి సంగీత నాట్య వేదిక అవార్డు

**జడ్చర్ల , జనవరి 5 ప్రభాతవార్త:** హైదరాబాద్‌లోని చిక్కడపల్లిలో కళా సంగీత నాట్య వేదిక ఆధ్వర్యంలో జాతీయ అవార్డు 2025 పురస్కారాలు అందజేశారు. జడ్చర్లకు చెందిన ఉమెన్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి చేసిన సేవలకు గుర్తింపుగా నాట్య వేదిక అవార్డును అందజేశారు. జడ్చర్ల పట్టణంలో సామాజిక మహిళా సాధికారత కుట్టు శిక్షణ శిబిరం , మగ్గము కార్యక్రమాలు నిర్వహిస్తూ సమాజంలో తమ వంతు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ వృద్ధులకు , అనాధలకు దుస్తులు పంపిణీ కరోనా సమయంలో మాస్కులు పంపిణీ ఇద్దరూ అనాథలకు దుస్తులు, కూరగాయలు నిత్య అవసరాలు పంపిణీ సమాజంలో ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్న బాలమణికి అవార్డు రావడం సంతోషించదగ్గ విషయమని సంస్కార భారతీ సభ్యుడు గోనెల రాధాకృష్ణ తెలిపారు. స్వచ్ఛంద సేవ సంస్థలు పట్టణవాసులు, బాలమణికి అభినందనలు తెలిపారు.

## మద్యం సేవించి వాహనాలు నడపరాదు

**నారాయణపేట ఎస్పై గాయత్రి**

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** మద్యం సేవించి వాహనాలు నడపరాదని పి ఎస్సై గాయత్రి అన్నారు. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఆదేశాల మేరకు నారాయణపేట జిల్లా కేం ద్రంలో ఎస్సై గాయత్రి ఆధ్వర్యం లో ఆదివారం సాయంత్రం నారా యణపేట పోలీసులు ముమ్మ రంగా వాహనాల తనిఖీలు నిర్వ హించడం జరిగింది. పలు వాహ నదారులకు బ్రీత్ అనలైజర్ తో డ్రంకన్ కండిషన్ తనిఖీ చేయ డం జరిగింది. ఈ సందర్భంగా శిక్షణ ఎస్సై గాయత్రి మాట్లాడు తూ వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదని మద్యం సేవించి వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణాలు పోయే అవకాశం ఉంటుందని తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపరాదు అని వాహనదారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వారికి జరిమానాతో పాటు జైల్ శిక్ష విధించడం జరుగుతుందని, మద్యం సేవించిన కేసులు పునరావృత్తం అయితే వాహనాన్ని సీజ్ చేయడం జరుగుతుందని దాంతోపాటు డ్రైవింగ్ లైసెన్స్ రద్దు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎస్సై ఆంజనేయులు, పోలీసులు వాహనదారులు తదితరులు పాల్గొన్నారు.



వాహనాల తనిఖీ చేస్తున్న దృశ్యం

# చైల్డ్ ఫ్రెండ్లీ బాలల న్యాయ సేవల పథకం కమిటీ ఏర్పాటు

**సేవా దృక్పథంతో న్యాయ సేవలు అందించాలి**

**జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్**

**నారాయణపేటటౌన్, జనవరి5 ప్రభాతవార్త:** క్షేత్రస్థాయిలో ఇబ్బందు లు, అవమానాలు ఎదురైన చిత్తశుద్ధితో సేవా దృక్పథంతో న్యాయ సేవలు అందించేందుకు తమ వంతు బాధ్యతగా పనిచేయాలని జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అన్నారు. జాతీయ, రాష్ట్రన్యాయ సేవ అధికారసంస్థల ఆదేశా లమేరకు జిల్లాన్యాయ సేవ అధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రిన్సి పాల్ జడ్జి మహమ్మద్ అబ్దుల్‌రఫీ సూచనలమేరకు జిల్లాకోర్టు ఆవరణలోని సమావేశ మందిరంలో బాలల హక్కులు, చట్టాల అమలు, రక్షణ, సంరక్షణ వంటి అంశాలపై చైల్డ్ ఫ్రెండ్లీ కమిటీ సభ్యులకు నిర్వహిస్తు న్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ఆదివారం ముగిసింది. ఈ సం దర్భంగా కమిటీ సభ్యులకు బాల్య వివాహాల నివారణ, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, బాలల చట్టాలు వంటి అంశాలపై పలు సూచన లు, సలహాలు ఇచ్చారు. స్నేహపూర్వకమైన బాలల న్యాయ సేవల పథకం 2024 ప్రకారం బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అనంతరం న్యాయమూర్తి నారాయణపేట జిల్లాలో ఏర్పాటు అయినటువంటి చైల్డ్ ఫ్రెండ్లీ స్కీం న్యాయ సేవలు విభాగం యొక్క బాధ్యతలను, 2025 సంవత్సరం మొత్తం చేప ట్టాల్సిన కార్యక్రమాల పట్టికను ఆ విభాగం ద్వారా ప్యానెల్ లాయ ర్స్ మరియు పారా లీగల్ వాలంటీర్స్ కీ ఎలాంటి పనులు చేయాలి, గ్రామీణ ప్రాంతాలలో ఎలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిం చాలి, ఎవరెవరితో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి అదేవిధం గా వివిధ సంస్థలతో ఏ విధంగా సహకారం తీసుకోనీ న్యాయ విజ్ఞా న సదస్సు నిర్వహించాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో కమ్యూని టీ మొబిలైజేషన్ ఆఫీసర్, రాజేంద్రకుమార్ మాట్లాడుతూ విద్యాహ క్కుచట్టం 2009 భారతరాజ్యాంగంలో విద్య అనేది ఉమ్మడి జాబి తాలో ఉంది. కేంద్రం, రాష్ట్రాలు రెండూ ఈ చట్టంలో సవరణలు చేయవచ్చు. చట్టం అమలు కోసం కేంద్రం, రాష్ట్ర, స్థానిక సంస్థలకు నిర్దిష్ట బాధ్యతలను నిర్దేశిస్తుంది. ఆమోదం ఈ బిల్లును 2 జూలై 2009న మంత్రివర్గం ఆమోదించింది. రాజ్యసభ 20 జూలై 2009 న బిల్లును ఆమోదించింది. లోక్‌సభ 4 ఆగస్టు 2009న ఆమోదిం చింది. 26 ఆగస్ట్ 2009న రాష్ట్రపతి ఆమోదం పొంది, చట్టంగా నోటిపై చేయబడింది. అమలు ప్రస్తుతం భారతదేశంలోని రాష్ట్రాలు విద్యలో ఈచట్టాన్ని అమలు చేస్తున్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతలు, విధులు, వివిధ భాగస్వామ్య పక్షాల బాధ్యతలు విధులు కమిటీ మెంబర్స్‌కి తెలియజేశారు. డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ శ్రీ తిరుపతయ్య, డిఫెన్స్ కౌన్సిల్స్ కే లక్ష్మిపతి గౌడ్, నాగేశ్వరి, కమిటీ మెంబర్స్ రఘువీర్‌యాదవ్, పిఎల్‌విస్‌కార్యక్రమంలో భాగంగా మా ట్లాడుతూ చట్టపరమైన పాలసీ పరమైనటువంటి ప్రేమవర్క్ లో భా గంగా రాజ్యాంగపరమైన నిబంధనలో రాజ్యాంగంలో పిల్లల కోసం పొందు పరిచినటువంటి ఆర్టికల్స్‌ని మరియు చట్టబద్ధ నిబంధనలో బాల్యవివాహాల నిషేధ చట్టం2006, చట్టంలో పొందుపరచినటువం టి బాల్యవివాహాల నిరోధక అధికారులకు సంబంధించి నటువంటి సమాచారం శిక్షణకార్యక్రమంలో చెప్పడం జరిగింది బాలకార్మిక వ్యవ స్థ నిర్మూలన చట్టము 1986 వివరించడం జరిగింది. పాలసీ ప్రేమ్ వర్క్‌లో భాగంగా నేషనల్ పాలసీఫర్‌చిల్డ్రన్2013, మిషన్ వాత్సల్య స్కీం 2022 గురించి చెప్పడం జరిగింది. న్యాయ సలహా మండలి కి, ఏదైనా నేరంలో సాక్ష్యంగా ఉన్న బాలలకు తల్లిదండ్రులు జైలు శిక్ష అనుభవిస్తున్నటువంటి వారి పిల్లలకు జిల్లా న్యాయసేవ విభా గం ఏవిధంగా వారికి న్యాయ సేవలు అందించాలో తెలియజేయడం జరిగింది. ఉచిత న్యాయ సేవ విభాగ సభ్యులైనటువంటి పారా లీగల్ వాలంటరీస్ ప్యానల్ లాయర్స్ అందరికీ కూడా పిల్లలతో ముఖాముఖి చర్చించేటప్పుడు పాటించాల్సినటువంటి నియమాల గురించి వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో న్యాయమూర్తి, కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్, రాజేందర్, డిస్టిక్ చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి తిరుపతయ్య, డిఫెన్స్ కౌన్సిల్స్ కె.లక్ష్మిపతి గౌడ్, నాగేశ్వరి, కమిటీ మెంబర్స్ ప్యానల్ అడ్వకేట్లు పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.




మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

## కొల్లూరులో పూలే,అంబేద్కర్ వాలీబాల్ టోర్నమెంట్

**ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డి**

**నవాబుపేట, జనవరి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొల్లూరు గ్రామంలో పూలే, అంబేద్కర్ అసోసియేషన్స్ ఆధ్వర్యంలో సీజన్ 4 వాలీబాల్ ఓపెన్ టు ఆల్, రూరల్ విభాగంలో టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు పూలే, అంబేద్కర్ వాలీబాల్ అసోసియేషన్ నిర్వాహకులు విస్లావత్ చందర్ నాయక్, ఎస్.రమేష్ మహమ్మద్ ఖాజామైనోద్దీన్, కె.కృష్ణగౌడ్ లు తెలిపారు. 6 7 తేదీలలో రెండు రోజులపాటు టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓపెన్ టు ఆల్ మొదటి విజేతలకు 30 వేల రూపాయలు యస్.రమేష్ లంబ వెంకటయ్య,ద్వితీయ విజేతలకు 15వేల రూపాయలు ఆగిర్యాల బాల్ రెడ్డి ప్రతాప్ లు,తృతీయ విజేతలకు మాజీ సర్పంచ్ మంచికంటి సౌజన్య రఘు రూ. 10 వేలు రూరల్ విభాగంలో మొదటి విజేతకు రూ. 10 వేల ద్వితీయ విజేతకు రూ. 5 వేల పూలే అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇవ్వనున్నట్లు తెలిపారు. షీల్డ్, మెమెంటో బహుకరణ మాజీ సర్పంచ్ గుండు లక్ష్మినరసింహారాజు ఇవ్వనున్నట్లు నిర్వాహకులు గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం, క్రీడాకారుల్లో స్నేహభావం పెంపొందించడం కోసం టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. టోర్నమెంట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథులుగా జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి, మాజీ మంత్రివర్యులు చర్లకోల లక్ష్మారెడ్డి,మండల ప్రజా ప్రతినిధులు మండల అధికారులు హాజరుకానున్నారని నిర్వాహకులు తెలిపారు. క్రీడాకారులకు శ్రీ లక్ష్మినివాస ఇండస్ట్రీస్ యజమానులు కొల్లూరు మధు కుమార్ రవికుమార్‌లు భోజన వసతి కల్పిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ టోర్నమెంట్ కొల్లూరు గ్రామంలో ఉన్న ఉద్యోగస్తులు ప్రజాప్రతినిధుల,యువకుల సహకారంతో నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్స్ బి.జంగయ్య, ఎదిరా జగన్,పి.నిరంజన్, జె.రమేష్ గౌడ్, సున్నాల కృష్ణయ్య,ఎం.గౌరయ్య,ఎల్.ఎన్.స్వామి, అవుసుల రాజు,లంబ కొమురయ్య,కుమ్మరి రవి తదితరులు పాల్గొన్నారు.



వాలీబాల్ టోర్నమెంట్ నిర్వహిస్తున్న దృశ్యం

## ముగ్గుల పోటీ విజేతలకు బహుమతులు అందజేత

**రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి**

**వనపర్తి టౌన్ జనవరి 05 ప్రభాతవార్త :** వనపర్తి పట్టణం వెంగల్ రావు కాలనీ, సాయి నగర్ కాలనీ పార్క్ లలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ అధ్యక్షుడు కోట్ల రవి, శిరీష ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని ముగ్గుల పోటీలను నిర్వహించడం జరిగింది. ముగ్గుల పోటీల కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి పాల్గొని ముగ్గులను పరిశీలించారు. ముగ్గుల పోటీ కార్యక్రమాన్ని ఉద్దేశించి డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మాట్లడుతూ ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలకు మొదటగా అడ్వాన్సుగా సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ప్రజా ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని అందులో భాగమే ఫ్రీ బస్సు, ఇందిరా క్యాంటీన్లను కూడా మహిళలకు కేటాయించిందని గుర్తు చేశారు. అలాగే మహిళలను కోటీశ్వరులుగా చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తుందని అన్నారు. సంక్రాంతి ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలను అభినందించడం జరిగింది. ముగ్గుల పోటీలో 47 మంది మహిళలు పాల్గొనగా ముగ్గురిని విజేతలుగా ప్రకటించడం జరిగింది. మొదటి విజేత కవిత (అమ్మ పల్లె) ని శాలువతో సన్మానించి ఆరువేల ప్రైజ్ మనీని ఇచ్చారు. అలాగే మిగతా విజేతలకు చాలువతో సన్మానించి ప్రైజ్ మనీని అందజేశారు. ముగ్గుల పోటీలను నిర్వహించిన కోట్ల రవి శిరీషని శాలువతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి పట్టణ అధ్యక్షుడు చీర్ల చందర్, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ కదిరే రాములు యాదవ్, జిల్లా మత్స్యకార సెల్ అధ్యక్షుడు నందిమల్ల యాదయ్య, వనపర్తి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి ఆదిత్య, వనపర్తి జిల్లా కి సమస్యల అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, వనపర్తి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణ, యూత్ కాంగ్రెస్ నాయకులు లాయర్ బాబా, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు జానకి రాములు, కౌన్సిలర్ పరశురాములు, వనపర్తి మండల్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఆవుల చంద్రశేఖర్, వనపర్తి మండల్ ఎన్ఎస్‌యుఐ అధ్యక్షుడు చరణ్, ఏఐసిసి వనపర్తి జిల్లా ఉపాధ్యక్షులు నాగార్జున, సీనియర్ నాయకులు రాగి వేణు, కోళ్ల వెంకటేష్, శరత్, వెంకటేష్, అబ్దుల్లా, శరత్, పెద్దమందడి మండల్ కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కోఆర్డినేటర్ గట్టు రాజు కాంగ్రెస్ పార్టీ నాయకులు, విద్యార్థుల తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లెల చిన్నారెడ్డి

## పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు పండుగ సాయన్న పేరు పెట్టాలి

**బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్**

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జైపాల్‌రెడ్డి పేరు పెట్టడం సరికాదని పండుగ సాయన్న పేరు పెట్టాలని బిఆర్ఎస్ పార్టీ నాయకులు గవినోళ్ళ శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జయపాల్ రెడ్డి పేరు పెట్టడం సరికాదన్నారు. మీ మామ అయినంత మాత్రాన పేరు పెడ్తావా.. జైపాల్ రెడ్డి జిల్లా కు చేసింది ఏమి లేదు అన్నారు. పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్ట్ కు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం అంటే మొత్తం పాలమూరు జిల్లా ప్రజలను, రైతులను మోసం చేయడం కిందికే వస్తుంది, జైపాల్ రెడ్డి యూపిఏ ప్రభుత్వం లో కీలక మంత్రి గా ఉండి వివిధ శాఖలు నిర్వహించడం జరిగింది, కానీ ఆయన పాలమూరుకు ఎలాంటి అభివృద్ధి పనులు చెయ్యలేదు అన్నారు. అవకాశం ఉన్న కూడా ఆయన పాలమూరు రంగా రెడ్డి ప్రాజెక్ట్ కు జాతీయ హోదా ఇప్పించలేదు అన్నారు. ఆనాడు రాజశేఖర్ రెడ్డి దౌర్జన్యం గా అక్రమంగా పోతరెడ్డి పాడు ప్రాజెక్ట్ ద్వారా కృష్ణా జలాలను తరలిస్తే కనీసం నోరు మేద పలేదు అన్నారు. అలాంటి వ్యక్తి పేరు ఈ రోజు కెసిఆర్ కష్టపడి 90 శాతం పూర్తి చేసిన ప్రాజెక్టుకు జైపాల్ రెడ్డి పేరు పెట్టడం తగదు. కేవలం మీ మామ అయినంత మాత్రాన ఆయన పేరు పెట్టడం అంటే అధికారం తో ఏదన్నా చెయ్యొచ్చు అనే నీ విపరీత ఆలోచన ధోరణి తెలంగాణ సమాజం అర్థం చేసుకుంటుంది. నిజాం రజాకార్లను, భూస్వాములను ఎదిరించిన పండుగ సాయన్న పేరు పెట్టాలి అని డిమాండ్ చేశారు.

## మామిడిలో తెల్ల పూత రావడంతో రైతుల ఆందోళన

**వీపనగండ్ల జనవరి 05 ప్రభాతవార్త :** మామిడి తోటలో ఈసారి ఆశించిన మేరకు పూతలు రావడం వల్ల రైతులు సంతోష పడుతూ ఈసారి మామిడి తోటలో ఆశాజనకంగా ఉంటాయని సంతోషపడుతున్న రైతులకు డిసెంబర్ లో వచ్చినటువంటి మామిడి పూతలు తెల్లగా రావడం వల్ల బిందె ఏర్పడకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పెట్టుబడులు విపరీతంగా అవుతున్న మామిడి కి మాత్రం ఆశించిన స్థాయిలో కాయ తెంపే దశలో గిట్టుబాటు ధర లేక ఇబ్బందులు పడవలసి వస్తుందని హైదరాబాదు లాంటి మామిడి తోటల మార్కెట్లో దళారీలు చెప్పిన రేటుకే మామిడి ఇచ్చి రావాల్సి వస్తుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అయితే ప్రధానంగా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో దాదాపుగా 17వేల మంది రైతులు 55 వేల ఎకరాలలో మామిడి సాగు చేస్తున్నారు. దీనికి నేషనల్ హార్టికల్చర్ ద్వారా 165 కోట్ల రూపాయలు కేటాయించి రైతులకు మెలకువలు పాటించే విధంగా వివిధ రకాల పద్ధతుల ద్వారా చైతన్యం చేసేటందుకోసం కృషి చేస్తున్న తరుణంలో మామిడి పంటలు రావాలి అంటే శాస్త్రీయ ఆలోచనతో ముందుకు పోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని రైతులు కోరుతున్నారు అయితే వనపర్తి జిల్లాలోని వీపనగండ్ల మండలంలో మామిడి తోటలో ఎక్కువగా ఉంటాయి దాదాపు 1600 ఎకరాలకు పైగా మామిడి సాగు చేస్తున్నారు. అయితే ఈ ప్రాంతం నుండి దాదాపు 30 సంవత్సరాల పైగా మామిడి తోటలో పెంపకాలు కొనసాగుతున్నాయి. మదనాపురం కెవికె శాస్త్రవేత్తలు సూచనలు ఇస్తున్నప్పటికీ వాతావరణం అనుకూలించకపోగా తోటలు అనేక రకాలుగా మామిడి రైతులు ను దెబ్బతీస్తున్నాయి. అయితే గత రెండు మూడు సంవత్సరాల నుండి తేనెమంచు పురుగు తోటలకు వ్యాపితి చెందడం వల్ల ఆశించిన స్థాయిలో పంటలు రాలేదు ఈ సంవత్సరము వాతావరణం అనుకూలించి వర్షాలు బాగా పడటం వల్ల మామిడి తోటలకు పూతలు బాగా రావడం జరిగింది. అయితే అక్టోబర్ నవంబరు దశలో కొంత మామిడి తోటలు ముందుగా పూతలు పూయడం వల్ల బిందె ఏర్పడి కాయలు పావు కేజీ సైజు రావడం జరిగింది. అదే డిసెంబర్ నెలలో వచ్చినటువంటి మామిడి పూత తెల్లగా రావడం వల్ల దాన్ని రైతులు మగ పూతగా భావించడం జరుగుతుంది శాస్త్రవేత్తలు కూడా చెప్తున్నారు. అయితే పూత కొద్దిగా ఎరుపు కలర్ వస్తే దాన్ని ఆడ పూతగా భావిస్తారు పూత వచ్చిన దశలో ఆడ పూత మొగ్గ పూత రెండు కూడా సమపాళ్లనే వస్తేనే పిందెలు నిలబడదానికి అవకాశం ఉంటుందని రైతులు భావిస్తున్నారు. అయితే ఈ దశలో వాటికి పూత నిలబెట్టుకుని కోసం పిందే రావడం కోసం మందులు వాడటాన్ని హార్టికల్చర్ అధికారులు సూచనలు చేయాలని రైతులు కోరుతున్నారు.



మామిడి తోటలో పూసిన తెల్లపూత

## విజయవంతమైన సంతకాలు సేకరణ



**ధన్వాడ, జనవరి 5 ప్రభాతవార్త :** సంతకాల సేకరణకు బీసీ కాలనీ ప్రజల మద్దతు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని కోరుతూ రెండు రోజుల నుంచి దన్వాడ లో అంజయ్య చేస్తున్న సంతకాల సేకరణకు ప్రజలు పెద్ద సంఖ్యలో మద్దతు తెలుపుతున్నారు. ఆదివారం ధన్వాడ బీసీ కాలనీ సంతకాల సేకరణ చేపట్టారు. మహిళలు ప్రజలు పూర్తి స్థాయిలో మద్దతు ఇచ్చారు. రఘువీర్, రంగయ్య, చింతకాయల బాలయ్య, పెదుమూతి శ్రీను, అలుగు మిది భాస్కర్, కాంగ్రెస్ నాయకులు హరీష్ బిజెపి నాయకులు కురుమూర్తి యాదవ్, కన్నరెడ్డి, మాజీ ఉపసర్పంచ్ కూర్వ నర్సింహులు, బీబీ కుసుమ కాళమ్మ, ప్రమీల, గీత, పూజ అంజిలమ్మ, మాసమ్మతో పాటుగా పలువురు పాల్గొన్నారు .

## దుకాణాల బంధు విజయవంతం



మూసి ఉంచిన దుకాణ సముదాయం

**వెల్దండ, జనవరి 05 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో ప్రతినెల 5వ తేదీన దుకాణదారులు తమ తమ దుకాణాలను బంధు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు ఈ సందర్భంగా ఆదివా రం మండల కేంద్రంలో దుకాణదారులు స్వచ్ఛందంగా బంధు నిర్వహించారు ఇదే విధంగా ప్రతి నెలలో 5వ తేదీన నిర్వహి స్తామని కస్టమర్లకు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో దుకాణ దారులు రాజేందర్ రెడ్డి, పూరి శివ కుమార్, వెంకటేష్, ప్రహ్లా దు, బొమ్మిశెట్టి శ్రీనివాస్, ధనంజయ్ కిరణ్, సంతోష్, రాజు, నరేష్, తానేష్, అల్లాజితో పాటు తదితరులు ఉన్నారు.

## వెల్దండ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో ముగ్గులు ఆటల పోటీలు

**వెల్దండ, జనవరి 5 ప్రభాతవార్త:** సంక్రాంతి, గణతంత్ర దినోత్స వ పురస్కరించుకొని వెల్దండ రిక్రియేషన్ క్లబ్ ఆధ్వర్యంలో మహిళలకు సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని గ్రామ స్థాయి ముగ్గుల పోటీలు, గణతంత్ర దినోత్సవ సందర్భంగా మండల పాఠశాల స్థాయి విద్యార్థులకు కబడ్డీ పోటీలను నిర్వహి స్తున్నట్లు క్లబ్ అధ్యక్షులు యెన్నం కృష్ణారెడ్డి, క్రీడా కార్యదర్శి అమర్నాథ్ యాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లా డుతూ పాల్గొనే పాఠశాల టీమ్ మెంబర్స్ క్లబ్ సభ్యుల వద్ద జనవరి 10 తేదీ వరకు నమోదు చేసుకోగలరన్నారు. ఈ కార్య క్రమంలో ఉపాధ్యక్షులు వై.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఆంజనేయులుతో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

## కుంగ్‌ఫు కరాటే పోటీలలో రేడియంట్ హై స్కూల్ విద్యార్థి ప్రతిభ



**మక్తల్ టౌన్ జనవరి 5 ప్రభాతవార్త:** జాతీయస్థాయి కుంగ్‌ఫు కరాటే పోటీలో నారాయణపేట జిల్లా మక్తల్ కు చెందిన విద్యార్థి చక్కని ప్రతిభ ప్యారడైస్ గ్రాండ్ ఫంక్షన్ హాల్ హైదరాబాద్‌లో టైగర్ కుంగ్‌ఫు అకాడమీ వారి ఆధ్వర్యంలో నిర్వహించినటువంటి మొదటి జాతీయస్థాయి కుంగ్‌ఫు కరాటే పోటీలలో రేడియంట్ హైస్కూల్ కరాటే క్లాస్ విద్యార్థి బట్టి మాయ అండర్ 16 ఇయర్స్ విభాగంలో బంగారు పతకంతో పాటు గ్రాండ్ ఛాంపియన్ షిప్ కూడా కైవసం చేసుకున్నట్టుగా కరాటే వ్యవస్థాపకులు షిహాన్ సలాంబిన్ ఉమర్ డ్రాగన్ షోటోకాన్ కరాటే డు స్పోర్ట్స్ స్టైల్ మరియు నేషనల్ చీఫ్ తెలిపారు ఈ కార్యక్రమంలో కుంగ్ ఫు గ్రాండ్ మాస్టర్లు శివ కోటి, శ్రీనివాస్ పాల్గొన్నారు చీఫ్ ఎగ్జామినర్ సి అంబ్రేష్ వైస్ ప్రెసిడెంట్ కె అంజన్ ప్రసాద్ టోర్నమెంట్ ఇంచార్జ్ మొహమ్మద్ సలీం, కరాటే మాస్టర్ అశోక్, తాయప్ప, అక్షర, ఫాతిమా, మాయ పాల్గొన్నారు.

## విద్యానిధికి విరాళాల వెల్లువ


చెక్కు అందజేస్తున్న శ్రీనివాసరాజు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

మాకు మరింత బలం ఇచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, రిషి డైరెక్టర్లు పూజిత మోహన్ రెడ్డి, చంద్రకళ, సుశాంత్ కృష్ణ తదితరులు పాల్గొన్నారు. రూ.50వేల డొనేషన్ ఇచ్చిన శ్రీనివాస్‌రాజు విద్యానిధికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చలువగాలి శ్రీనివాస్ రాజు మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డిని వారి క్యాంపు కార్యాలయంలో కలిసి విద్యా నిధికి రూ.50 వేల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆయనను అభినందించారు. మహబూబ్ నగర్ ను తెలంగాణ రాష్ట్రంలోనే కాకుండా దేశంలోనే విద్య లో మొదటి స్థానంలో నిలపాలనే ఉద్దేశం తో ఉన్నామని అందుకు మన మహబూబ్ నగర్ పుర ప్రముఖులు ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు.

## ఏడాదిలో 7సార్లు కౌన్సిల్ సమావేశాలు

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అధికారులు సత్సం బంధాలు కలిగి ఉంటే ఏ సమస్య లేదని చెప్పారు. అందరూ కలిసి మహబూబ్‌నగర్‌ను అన్నిరంగాల్లో అభివృద్ధి చేయాలన్న తపన ఒక్క టే ప్రధానం అన్నారు. అధికారులు ఎవరైనా తప్పులు చేస్తే చట్టప్ర కారం చర్యలు తప్పవని,ప్రజాధనం లూటి చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. ఇడబ్ల్యుఐడిసి నిధులతో అధునాతన తరగతి గదుల ను నిర్మాణం చేపట్టేందుకు ప్రయత్నం చేస్తామన్నారు. గత సంవత్స రం డిజిటల్ కంటెంట్ మెటీరియల్స్ ఇస్తే పదవతరగతిలో ఫైనల్ పరీక్షల్లో 23 అధిక ఫలితాలను సాధించడం జరిగిందని, ఈ సంవత్సరం కూడా డిజిటల్ కంటెంట్‌ను మహబూబ్‌నగర్ నియోజక వర్గంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో అందించడం జరిగిందని, ఉపాధ్యాయులకు కూడా ఈ డిజిటల్ కంటెంట్ వినియోగం పైన రెండు రోజులు శిక్షణ తరగతులను నిర్వహించడం జరిగిందన్నారు. ఏది ఏమైనా మహబూబ్ నగర్ అభివృద్ధి చెండమే ప్రధానమని,పార్టీలకు అతీతంగా ప్రతి వార్డులో సైతం నిధులను ఈ సంవత్సర కాలంలో భారీగా అందించామని ఆయన స్పష్టం చేశారు. అందుకే ప్రతి వార్డు లో సిసి రోడ్డు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ లను పూర్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కెరి అనిత మధుసూదన్ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి సిరాజ్ ఖాద్రీ, జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ చైర్మన్ సాయి బాబా, నాయకులు ఆజ్మత్ ఆలి, ఫయాజ్, జేసిఆర్, ప్రవీణ్ కుమార్, యూత్ కాంగ్రెస్ నాయకులు ఇమ్రాన్, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

## ఆర్డినరీ బస్సుకు ఎక్స్‌ప్రెస్ డబ్బులా..

**నారాయణపేట డిపోలో జరుగుతున్న తీరు**

**ఎక్స్‌ప్రెస్ బోర్డు ఉంటే చాలు డబ్బులు ఇవ్వాల్సిందే**

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** నారాయణపేట డిపో నుండి వివిధ ప్రాంతాలకు వెళ్లి బస్సులకు బస్సును బట్టి చార్జీలు తీసుకుంటారు. నారాయణపేట డిపోలో ఆర్డినరీ బస్సు ఉండి బోర్డు ఎక్స్‌ప్రెస్ ఉంటే చాలు ఎక్స్‌ప్రెస్ డబ్బులు తీసుకుంటారు. దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు ఇలా చేయడం వల్ల తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆర్డినరీ బస్సులకు బోర్డులు పెట్టి ఎక్స్‌ప్రెస్ చార్జీలు తీసుకోకుండా బస్సుల ఏర్పాట్లను బట్టి చార్జీలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు. ఇలాంటి విషయాలపై ఆర్టీసీ అధికారులకు పలుమార్లు ఫిర్యాదులు చేసిన పట్టించుకోవడం లేదని తెలియజేస్తున్నారు. ఇకనైనా ఆర్టీసీ అధికారులు స్పందించి ఇలాంటి విషయాలు పునరావృతం కాకుండా చూసుకోవలసిన బాధ్యత ఆర్టీసీ డిపో మేనేజర్ పై ఉందన్నారు.



ఆర్డినరి బస్సుకు ఎక్స్‌ప్రెస్ బోర్డు పెట్టిన దృశ్యం

## జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో కొండాపూర్ విద్యార్థుల ప్రతిభ

**ధన్వాడ, జనవరి 5 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన విద్యా వైజ్ఞానికలో ధన్వాడ మండలం కొండాపూర్ ఎస్టీ గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు 8 వతరగతి విద్యార్థి ఆర్.ప్రవీణ్, సైన్స్ టీచర్ జి. అనిల్ సింగ్ ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఆర్గానిక్ పార్మింగ్ ఆటో హోమ్ నేచురల్ ప్రామింగ్ అనే అంశానికి జూనియర్ విభాగంలో మొదటి బహుమతి అందుకొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాంది. అదే విధంగా 9వ తరగతికి చెందిన ఎం. సాయి కిరణ్, సైన్స్ టీచర్ తిమ్మప్ప ఆధ్వర్యంలో ప్రదర్శించిన ఈకో ఫ్రెండ్లీ వాటర్ హార్వెస్టింగ్ సోలార్ రోడ్ రిసోర్స్ మేనేజ్ మెంట్ అనే అంశానికి సీనియర్ విభాగంలో మొదటి బహుమతి పొంది రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రాజారాం తెలిపారు. ఈనెల 7 నుంచి 18 వరకు మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో ఈ ప్రదర్శనలు ఇవ్వడం జరుగుతుందన్నారు. విద్యార్థుల ప్రదర్శన రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం పట్ల గిరిజన గురుకులల కార్యదర్శి సీతా ఆఫీసర్ కళ్యాణి లు విద్యార్థులను అభినందించారు.

## గల్లంతు అయిన యువకుడి మృతదేహం వెలికితీత

**ధన్వాడ వేంకటేశ్వర స్వామి బావి నుంచి తీస్తున్న శవం**

**ధన్వాడ, జనవరి 5 ప్రభాతవార్త:** ధన్వాడ శ్రీ వేంకటేశ్వర స్వామి కోనేరులో శనివారం రాత్రి గల్లంతు అయిన మృతదేహన్ని ఆదివారం వెలికి తీశారు. ధన్వాడకు చెందిన బాలస్వామి (27) అనే యువకుడు రాత్రి సమయంలో కోనేరులో గల్లంతు అయ్యాడు. గల్లంతు అయిన యువకుడిని వెలికి తీయడం కోసం తెల్లవారుజామున అగ్నిమాపక సిబ్బంది కోనేరులో ఉన్న నీటిని ఎత్తిపోశారు. గంటల తరబడిగా నీటిని ఎత్తిపోశారు గంటల పాటుగా గాలింపు జరిగింది. పోలీసులు ఆగ్నిమాపక సిబ్బంది దగ్గరుండి గాలింపు జరిపారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం నారాయణపేట ఏరియా ఆసుపత్రికి తరలించారు. మాజీ అధ్యక్షుడు కుంభం శివకుమార్‌రెడ్డి సంఘటన స్థలానికి చేరుకోని వివరాలు అడిగి తెలుసుకున్నాడు.

## ఘనంగా గ్యార్మి వేడుకలు

**జడ్చర్ల, జనవరి 5 ప్రభాతవార్త:** జడ్చర్ల లారీ అసోసియేషన్ ఆధ్వర్యంలో గ్యార్మి వేడుకలు ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వేడుకలకు హాజరై ముస్లిం సోదరులకు గ్యార్మి శుభాకాంక్షలు తెలిపారు. స్థానిక నాయకులతో కలిసి ఫాతేహాలు, దువాలు నిర్వహించారు. అనంతరం మాజీ మంత్రి లక్ష్మారెడ్డి పట్టణంలోని పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## పతేపూర్ మైసమ్మ దేవతను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**స్వాగతం పలికిన అలయ కమిటీ**

**నవాబుపేట, జనవరి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కాకర్లపాడు పర్వతాపూర్ మైసమ్మ దేవాలయ జాతర బ్రహోత్సవాల సందర్భంగా మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అమ్మవారిని దర్శించుకుని అమ్మవారి ఆశీస్సులు తీసుకున్నారు. అలయ కమిటి చైర్మన్ జగన్ మోహన్ రెడ్డి, కార్యదర్శి మాదనీశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి లక్ష్మారెడ్డికి స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి లక్ష్మారెడ్డితో పాటు మాజీ జడ్పీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, మాజీ జడ్పీటీసీ రవీందర్ రెడ్డి. ఎంపీపీ ఆనంతయ్య, పిఎసిఎస్ చైర్మన్ నర్సిములు తదితర నాయకులు పాల్గొన్నారు.

## 18వ వారం కొనసాగిన ఉచిత భోజనం

**నవాబుపేట, జనవరి 5 ప్రభాతవార్త :** ఆదివారం మండల కేంద్రానికి సంతకొరకుచుట్టూ ముట్టు గ్రామాల నుండి తండాల నుండి దాదాపు నుండి వచ్చే ప్రజల కొరకు జెకే ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత భోజనం విజయవంతంగా జరిగింది. కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ నవాబుపేట వ్యాపార సంఘం అధ్యక్షులు సుధాకర్ చారి, నవాబుపేట మండల కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రచార కార్యదర్శి నవాబుపేట డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ పుట్టి ఆంజనేయులు, కమిటీ మహమ్మద్ అలీ, తీగలపల్లి ఆశన్న, తీగలపల్లి మాజీ ఉపసర్పంచ్ కృష్ణయ్య, కాకర్లపాడు రాజు, సహదేవ్, కిష్టంపల్లి కృష్ణయ్య, ఆఫీసు ఇన్చార్జి నాగలింగం, ప్రచార కార్యదర్శులు రఘు,జోగు చందు, పాండు తదితరులు పాల్గొన్నారు.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న నూతన డిఎస్పి

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** గద్వాల నూతన డిఎస్పీగా మొగులయ్య పదవి బాధ్యతలు చేపట్టారు. ఆదివారం జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాన్ని దర్శించుకుని ఆయన ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి శేష వస్త్రాలతో సత్కరించారు. వారి వెంట అల్లంపూర్ సిఐ రవిబాబు. ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ ఉన్నారు.



# పెద్దదిన్నె శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు

**9న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం.. 11న స్వామివారి దివ్య మంగళ రథోత్సవం**

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెద్ద గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి జాతర బ్రహ్మోత్సవాలు ఈనెల 8వ తేదీ నుండి 13వ తేదీ వరకు కొనసాగుతున్నట్లు 9 న శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి కళ్యాణోత్సవం. 11.12. 13 తేదీలలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే 11న సాయంత్రం స్వామి వారి రథోత్సవ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జయ సింహయ్య తెలిపారు.

**బ్రహ్మోత్సవ కార్యక్రమాలు...**

8న పుణ్యావాచనం, యాగశాల ప్రవేశం, అంకురార్పణం, ప్రతిష్ట నివేదన హారతి, 9న సుప్రభాత సేవ, ద్వార తోరణం, ధ్వజ కుంభారాధనలు. కలశ స్థాపన, నిత్య హోమాలు, శ్రీవారి కల్యాణోత్సవం, లఘు పూర్ణాహుతి, నివేదన హారతి, తీర్థాగోష్టి, 10 న వైకుంఠ ఏకాదశి పురస్కరించుకొని ఉత్తర ద్వార దర్శనం, సుప్రభాత సేవ, సాయంత్రం బ్రహ్మోత్సవం, బలిహరణం,లఘు పూర్ణాహుతి, నివేదన హారతి, 11న స్వామివారికి పూజలు అనంతరం సాయంత్రం దివ్య మంగళ బ్రహ్మ రథోత్సవ కార్యక్రమం. 12.13. తేదీలలో స్వామివారికి వివిధ ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.. బ్రహ్మోత్సవాల సందర్భంగా కళ్యాణోత్సవం జరిపించు దాతలు రూ.1001 దేవాలయంలో చెల్లించి రసీదు పొందాలని. అలాగే బ్రహ్మోత్సవ సమయంలో ప్రత్యేకంగా శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి వార్ల కళ్యాణోత్సవంలో చేయించు దాతలు రూ. 11 వేల116 చెల్లించాలని ఆలయ వ్యవస్థాపక చైర్మన్ జయ సింహయ్య భక్తులకు సూచించారు. అంతేకాక స్వామివారికి సమర్పించే కానుకలు దేవస్థానం హుండీలోనే వెయ్యాలని భక్తులను కోరారు. భక్తుల కోర్కెలు తీర్చే కొంగు బంగారం గా నిత్య పూజలు అందుకుంటున్నటువంటి శ్రీ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కనులారా వీక్షించి శ్రీవారి పరిపూర్ణ అనుగ్రహానికి పాత్రులు కావాలని భక్తులకు సూచించారు.


పెద్దదిన్నె గ్రామంలో వెలసిన శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం

**స్వామి వారి ఆలయ చరిత్ర....**

వందల సంవత్సరాల క్రిందట గ్రామంలో ఒక యాదవునికి కలలో శ్రీ వెంకటేశ్వర స్వామి వారు సాక్షాత్కారమై తను పూజ పురస్కారములు లేక ఉన్నానని యాదవుని మందలోని గోవుల పాలను సేవిస్తున్నానని వివరించి అంతర్ధానం కాగా ఆ వృత్తాంతాన్ని యాదవ భక్తుడు కులకర్ణికి వివరించగా యాదవునితో కలిసి కలలో కనిపించిన స్థలాన్ని పరిశీలించగా పురాతన కట్టడాలు కలిగిన కోటలో బావి దగ్గర శిథిలావస్థలో చేరిన ఆలయ పరిసరాలలో శ్రీ వెంకటేశ్వర స్వామి విగ్రహం కనిపించగా ఇందు నిమిత్తం గ్రామంలో గర్భాలయాన్ని నిర్మించి స్వామిని ప్రతిష్టించాలని సంకల్పించారు. ఆలయ నిర్మాణం పూర్తయ్యే నాటికి ఆ యాదవ భక్తుడు పరమపదించగా సదరు భక్తుని జ్ఞాపకార్థం అతని విగ్రహాన్ని ఆలయ ముఖ మండపంపై రాతి గోడలపై చెక్కించారు. తల పురాణాన్ని పరిశీలించి గద్వాల సంస్థాన దీశు లు ప్రహరి గోడలు నిర్మించి. సంస్థానాధీశులు జాగీరుదారులు నిత్య నైమిత్తిక సేవల నిమిత్తం మన్యం భూములను ఏర్పాటు చేశారు. ఆలయానికి విశేషంగా దక్షిణం వైపున వైకుంఠ ద్వారం కలదు. రోగాల బారిన పడకుండా మూగ జంతువులను క్రూర మృగాల బారిన పడకుండా కాపాడే వారిని ఇందు నిమిత్తం శ్రీవారికి నేటికీ ఆనవాయితీగా ఖడ్గం, డాలు, మీసాలు కలిగి ఉండే విధంగా అలంకరిస్తూ ఉంటారు. తిరుమలలో మాద్రి ఆలయం చుట్టూ శ్రీవారి దివ్య మంగళ బ్రహ్మ రథోత్సవమును తిరుమలకు వెళ్లలేని నిరుపేద భక్తులు దర్శించి తరిస్తుంటారు. ఈ మధ్యకాలంలో ప్రతి మాసము విశేషంగా శ్రావణ నక్షత్రం నందు మాస కళ్యాణాన్ని కూడా భక్తులు నిర్వహిస్తున్నారు.

# ప్రభుత్వం సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించాలి

- **సగరులను బీసీ డి నుండి బీసీ ఏ లోకి మార్చాలి**
- **అభివృద్ధిని విస్మరించిన రాజకీయపార్టీలను ఓడిస్తాం**
- **వచ్చే ఎన్నికల్లో పెద్ద ఎత్తున పోటీలో నిల్చుంటాం**
- **సగర సంఘం జిల్లా అధ్యక్షులు గట్టు శ్రీనివాసులు**

**కల్వకుర్తి,జనవరి5 ప్రభాతవార్త:**రాష్ట్రంలోని సగరులను భవన నిర్మాణ కార్మికులుగా గుర్తించాలని, సగరులను బీసీ–డీ గ్రూప్ నుంచి బీసీ–ఏ గ్రూపుగా గుర్తించాలని నాగర్‌కర్నూల్ జిల్లా సగర సంఘం అధ్యక్షుడు గట్టు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. కల్వకుర్తి పట్టణం లోని గాంధీనగర్‌లో అసంపూర్తిగా ఉన్న సగర సంఘం భవనాన్ని మాజీ ఎంపీ రాములు నిధులచే పూర్తి చేసిన భవన ప్రారంభోత్సవ, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కల్వకుర్తి మండల అధ్యక్షులు వావిలాల సురేష్, యువజన సంఘం అధ్యక్షులు వావిలాల రాకేష్ సాగర్‌లతో కలిసి జిల్లా అధ్యక్షులు సగర సంఘం భవనాన్ని ప్రారంభించి క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు మాట్లాడుతూ జిల్లాలో సగరుల జనాభా అత్యధికంగా ఉందని అందుకు తగ్గట్టుగా రాబోయే ఎన్నికలలో సగరులు పెద్ద ఎత్తున సర్పంచులుగా, వార్డు మెంబర్లుగా, ఎంపీటీసీలుగా, జెడ్పిటిసిలుగా, మున్సిపల్ కౌన్సిలర్‌లుగా పోటీ చేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఆయా గ్రామాల్లో, ఆయా పట్టణాల్లో, ఆయా మండల కేంద్రాల్లో సగర జనాభాను దృష్టిలో ఉంచుకొని వివిధ రాజకీయ పార్టీలు సగరులకు పోటీలో నిలబడేందుకు అవకాశం ఇవ్వాలని తెలిపారు. సగరులను విస్మరించిన పార్టీని భవిష్యత్తులో ఏ ఎన్నికలు వచ్చినా ఓడించడానికి సిద్ధంగా ఉంటామని తెలిపారు. ఏ రాజకీయ పార్టీకి మేము వ్యతిరేకం కాదని, ఏ రాజకీయ పార్టీ ఏ రాజకీయ నాయకుడు తమ సగరులను గుర్తిస్తారో వారికి అనుకూలంగా మేము పోరాడుతామని తెలిపారు. ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ 166 జీవోను పునరుద్ధరించాలని, సగరులను నిర్మాణ భవన కార్మికులుగా గుర్తించాలని, బిసి–డి నుండి బీసీ–ఏ లోకి మార్చాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. భవన నిర్మాణ రంగంలో 90 శాతం సగరులే ఉన్నారని 59 జీవోను సవరించి 25 శాతం ప్రభుత్వ కాంట్రాక్టు పనులను సగరులకు కేటాయించాలని కోరారు. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సగరుల అభివృద్ధికి తోడ్పాటుకు అన్ని విధాల సహాయ సహకారాలు అందించాలని విన్నవించుకుంటున్నట్టు తెలిపారు. అనంతరం జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యులను యువజన సంఘం జిల్లా అధ్యక్షులు వావిలాల రాకేష్ సాగర్ శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గౌరవాధ్యక్షులు సేగూర్ దుర్గయ్య, పట్టణ అధ్యక్షులు రొట్టె రాజు, వివేకానంద, జిల్లా కోశాధికారి పడకంటి రాజు సగర, పట్టణ ప్రధాన కార్యదర్శి కల్లెపల్లీ జంగయ్య, కోశాధికారి వావిలాల యాదగిరి, యువజన సంఘం అధ్యక్షులు బూర్గుల భరత్, సీనియర్ నాయకులు నార్లకంటి దాసు, తిరుపతయ్య,యాదయ్య,శంకర్, మురళీ, అర్జున్,నరేష్, శ్రీకాంత్, ఊరుకొండ మండల అధ్యక్షులు సుధాకర్ మరియు జిల్లా సభ్యులు, మండల నాయకులు, యువజన సంఘం నాయకులు, పలు గ్రామాల సగర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

## జూరాల కాలువలో అడ్డుగోడల తొలగింపు

**సాగు నీళ్ల కోసం నేతల పాట్లు.. కాలువల్లో అడ్డురాలను తొలగించిన కళ్యాణ్ రావు**

**చిన్నంబావి, జనవరి 5 ప్రభాతవార్త :** జూరాల చివరి ఆయకట్టు రైతులైన చిన్నంబావి మండల పరిధిలోని బెక్కం, అమ్మాయి పల్లి, దగడపల్లి, పెద్దదగడ, కొప్పునూరు, ఎల్లూరు, పెద్దమారు, అయ్యవారిపల్లి గ్రామాల రైతులు ఈనెల 2న రాష్ట్ర మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు దృష్టికి తీసుకెళ్లగా జూరాల అధికారులను మంత్రి ఆదేశించి గోపాల్‌దిన్నె రిజర్వాయర్ నింపి వారాబంది ద్వారా సాగునీళ్ళు అందిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం నాటికి చిన్నంబాయి చివరి కట్టు డి 36 గ్రామాలకు నీళ్లు రావడంలో ప్రధాన కాలువల్లో రాళ్లతో గోడలు నిర్మించి అడ్డంకులు ఏర్పడడంతో ఆదివారం కాంగ్రెస్ నాయకులు కళ్యాణ్‌రావు ఆధ్వర్యంలో గ్రామాల రైతులు, జూరాల లష్కర్లు కలిసికట్టుగా కాలువల్లో ఉన్న అడ్డుకోవడం తొలగించడం జరిగింది. దీంతో మండల రైతులు కళ్యాణ్ రావును అభినందించారు. వారి సూచన మేరకు కాంగ్రెస్ పార్టీ యువ నాయకులు కొత్త కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో డి 36 కాలువలో గోడలను తొలగిస్తున్న లష్కర్ లు రైతులు చివరి ఆయకట్టు రైతుల సమస్య పరిష్కారం దిశగా ప్రయాణం 2 వ తేదిన మన మంత్రి వర్యులు జూపల్లి కృష్ణారావు చిన్నంబావి మండలంలోని లిఫ్ట్ ఇరిగేషన్‌లను సందర్శించినప్పుడు మా పొలాలకు నీరు అందడం లేదు అని చివరి ఆయకట్టు రైతులు మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఉన్నతాధికారులను పురమాయించి ఇచ్చిన మాట ప్రకారం సాగునీటిని మంత్రి విడుదల చేయించారు. కానీ ప్రధాన కాలువల్లో జూరాల కాలువలో అడ్డుగా రాళ్లతో నిర్మించిన గోడలు ఉండడంతో చివరి వరకు నీరు అందడం గగనమైంది. ఇది గమనించిన స్థానిక కాంగ్రెస్ నాయకుడు కళ్యాణ్ రావు వివిధ గ్రామాల ప్రజలను ఎంటబెట్టుకొని కాలువలో ఉన్న అడ్డుగోడలను తొలగించడం జరిగింది. దీంతో మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. డి 36 కాలువ వెంట చిన్నమారూర్ నుండి బెక్కెం వరకు ప్రయానించి అందులో ఉన్న గోడలను తొలగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో వారివెంట లైన్ ఇన్స్పెక్టర్ జగదీష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ యాదవ్ , వెల్లటూర్ మాజీ సర్పంచ్ పల్లె మద్దిలేటి , ఆకుల వెంకటేష్, రమేష్, గోవిందు, ప్రకాష్, మధు,వినోద్,కుమార్ లష్కర్ లు శ్రీను,సాయిరాం, వివిధ గ్రామాల రైతులు తదితరులు పాల్గొన్నారు.


కాలువలో అడ్డుగా ఉన్న రాళ్ళను తొలగిస్తున్న దృశ్యం

## సాగు భూములకే సాయం పట్ల సంతోషం: జిల్లా కిసాన్ కాంగ్రెస్

**వనపర్తి క్రైమ్ జనవరి 05 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతంగానికి కొత్త సంవత్సరంలో మంచి జరగాలని వ్యవసాయాన్ని పండుగ చేయాలని ఉద్దేశంతో నిన్న సాయంత్రం జరిగిన క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో రైతు భరోసా పై కీలక నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నామని కిసాన్ కాంగ్రెస్ వనపర్తి జిల్లా అధ్యక్షుడు వేముల శ్రీనివాస్ రెడ్డి, మత్స్యశాఖ జిల్లా అధ్యక్షుడు యాదయ్య ముదిరాజ్, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు ఎండి సమద్, ఆదివారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 26 నుండి అంటే రాజ్యాంగం జరిగి 75 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రజలకు మూడు పథకాలను అమలులోకి తేవడం పట్ల చాలా సంతోషకరమని సాగుచేసిన భూములకే రైతు భరోసా కింద ఎకరాకు 12 వేలు చెల్లింపు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద భూమిలేని వ్యవసాయ కుటుంబ రైతులందరికీ ఏడాదికి రూ 12 వేలు అందించడం అదేవిధంగా 10 ఏళ్లు ఎదురు చూస్తున్న నిరుపేద ప్రజలు అర్హులైన వారందరికీ కొత్త రేషన్ కార్డులు. జారీ చేయడం నిర్ణయం తీసుకోవడం పట్ల రాష్ట్ర ముఖ్యమంత్రి కి కృతజ్ఞతలు తెలుపుతున్నామన్నారు. గత పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వం వ్యవసాయం చేయాని రాళ్లు, రప్పలు, గుట్టలు, రోడ్లకు, పరిశ్రమల భూములకు, రియల్ ఎస్టేట్ వెంచర్లకు, వందల ఎకరాలను కబ్జా చేసిన నాయకుల భూములకు ఇచ్చి రైతు బంధు పేరుతో రూ 22 వేల కోట్లు ప్రజాధనాన్ని బీఆర్ఎస్ నాయకులు దుర్వినియోగం చేసి నిజమైన రైతులకు ఇవ్వకుండా అసాములైన పెద్ద పెద్ద రైతులకు ఇచ్చి రాష్ట్రాన్ని అప్పుల కుప్పలుగా తయారు చేసిందని నేడు రాష్ట్ర ప్రభుత్వం రేవంత్ రెడ్డి నాయకత్వన ఎలాంటి షరతులు లేకుండా సాగు చేసి పంట పండించే ప్రతి రైతుకు అందే విధంగా పంట పెట్టుబడి కోసం ఆర్థిక సాయం ప్రకటించి రైతు భరోసా ఇవ్వడం పట్ల చాలా సంతోషకరమైన విషయమని అలాగే పాలమూరు ప్రాంతానికి చెందిన దివంగత నేత ఎస్ జైపాల్ రెడ్డి. పేరుతో పాలమూరు ప్రాజెక్టుకు పేరు పెట్టడం చాలా సంతోషమని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు కృతజ్ఞతలు తెలియజేస్తున్నారని ఈ సందర్భంగా అన్నారు.

## జర్నలిస్టు సమస్యలపై పోరాడే అతిపెద్ద యూనియన్ టీయూడబ్ల్యూజే (ఐజేయూ)

**పెబ్బేరు జనవరి 05 ప్రభాతవార్త :** జాతీయ, రాష్ట్ర స్థాయిలో జర్నలిస్టుల సమస్యలపై నిరంతరం పోరాడే యూనియన్ ఐజేయూకు అనుబంధంగా ఉన్న టీయూడబ్ల్యూజే అని సంఘం రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ అన్నారు. ఆదివారం పెబ్బేరు పట్టణంలో నిర్వహించిన పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల సభ్యత్వ నమోదు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెబ్బేరు ఉమ్మడి మండల విలేకరులు వారి సమస్యలను రాష్ట్ర, జిల్లా నాయకులకు తెలియజేశారు. ఈ సందర్భంగా మధు గౌడ్ మాట్లాడుతూ తాను పూర్వ జిల్లా అధ్యక్షుడిగా ఉన్నప్పుడే ప్రైవేట్ స్కూల్స్ లో చదివే పిల్లల ఉచిత విద్య విషయంలో అప్పటి డీఈఓ సుశాంద్ర రావుతో మాట్లాడి ప్రొసీడింగ్స్ ఇప్పించానని చెప్పారు. అలాగే ఎంతోమంది పాత్రికేయులకు అక్రిడిటేషన్‌తో సంబంధం లేకుండా వైద్యం కూడా ఉచితంగా చేయించామని తెలిపారు. వైద్య విభాగానికి ఒక ప్రధాన సభ్యున్ని కూడా జిల్లా హెడ్ క్వాటర్లో నియమించామని గుర్తు చేశారు. ఇక ఇండ్ల స్థలాల విషయంలో రాష్ట్రంలోనే పెబ్బేరు మొదటి స్థానంలో ఉన్నందుకు చాలా సంతోషంగా ఉందన్నారు. దీనికి కారణం కూడా టీయూడబ్ల్యూజే అని చెప్పారు. చిన్న చిన్న పొరపాట్లు ఏదైనా జరిగినా కూడా సరి చేసుకుని యూనియన్ ను ముందుకు నడిపించాలని సూచించారు. రాష్ట్రంలో ప్రతి సమస్యను రాష్ట్ర ప్రభుత్వంతో గళమెత్తి జర్నలిస్టులకు కావలసిన విద్య, వైద్యం, అక్రిడిటేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలపై మొదటి నుంచి కొట్లాడి ఇప్పించిన ఏకైక యూనియన్ మనదే అని పునరుద్ఘాటించారు. ప్రస్తుతం ఉన్న రాష్ట్ర నాయకులు క్షణ్ణంగా చర్చించి వర్కింగ్ జర్నలిస్టులకు అందరికీ అక్రిడిటేషన్ వచ్చేలా ప్రభుత్వంపై ఒత్తిడి చేస్తున్నామని, అర్హత గల ప్రతి ఒక్కరికి కార్డులు వస్తాయని అన్నారు. ఇప్పుడు వచ్చే అక్రిడిటేషన్ కార్డులో 3 ప్రయోజనాలు ఉంటాయని చెప్పారు. ఒక కార్డుతో అన్ని వసతులు కల్పించే విధంగా ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ ఎంతో కృషి చేస్తుందని రాష్ట్ర కార్యదర్శి మధు గౌడ్ తెలియజేశారు.



## ఎమ్మెల్సీని కలిసిన ఎల్‌హెచ్‌పీఎస్,సేవాదల్ నాయకులు

**భూత్పూర్,జనవరి 5,ప్రభాతవార్త :** గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను లంబాడ హక్కుల పోరాట సమితి(ఎల్‌హెచ్‌పీఎస్) జిల్లా నాయకులు,కాంగ్రెస్ సేవాదల్ నాయకులు ఆదివారం కలిసి తమ సమస్యలు విన్నవించారు.ఎమ్మెల్సీని కలిసినవారిలో ఎల్‌హెచ్‌పీఎస్ నాయకులు భీక్యానాయక్,దేవరాం నాయక్,రాము నాయక్‌లతో పాటు కాంగ్రెస్ సేవాదల్ కార్యదర్శి అబు బాకర్ సిద్దిఖీ తదితరులున్నారు. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నతో పాటు మల్లన్న రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు రజినీకుమార్‌ను కూడా వీరు కలిశారు.

## జోగులాంబ అమ్మవారిని దర్శించుకున్న గద్వాల నూతన డిఎస్పీ మొగులయ్య

**గద్వాల, జనవరి 5 ప్రభాతవార్త :** అలంపూర్ శ్రీ జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను గద్వాల నూతన డీఎస్పీ మొగులయ్య ఆదివారం దర్శించుకున్నారు. డీఎస్పీ తో పాటు అలంపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ రవిబాబు, ఇటిక్యాల ఎస్ఐ వెంకటేష్ కూడా ఉన్నారు.

## వివాహ వేడుకల్లో పాల్గొన్న కుంభం శివకుమార్ రెడ్డి

**నారాయణపేట టౌన్, జనవరి 5 ప్రభాతవార్త :** నారాయణపేట పట్టణంలోని ఎన్ఎస్‌యుఐ జిల్లా నాయకులు సోదరి వివాహ వేడుకలు ఆదివారం పట్టణంలోని శీల గార్డెన్‌లో జరిగాయి. కాంగ్రెస్ పార్టీ జిల్లా డిసిసి మాజీ అధ్యక్షులు కుంభం శివకుమార్‌రెడ్డి తో బాటు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బండి వేణు గోపాల్ తోపాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరై పెళ్లి వేడుకల్లో పాల్గొన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో పాటు మైనార్టీ జిల్లా నాయకులు ఉన్నారు.

## నివాళులు అర్పించిన శ్రీధర్ రెడ్డి

**ఇటిక్యాల, జనవరి 5 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొండపేట గ్రామానికి చెందిన మీసాల సవరన్న భార్య బిసమ్మ అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీ భర్త శ్రీధర్ రెడ్డి గ్రామానికి చేరుకుని ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను ఓదార్చి ఆ కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం కొండపేట గ్రామానికి తెలుగు నరసింహులు కుమారుడు గంగాధర్ అనారోగ్యం తో మృతి చెందాగా వారి కుటుంబ సభ్యులని ఓదార్చి ధైర్యం చెప్పారు. వీరి వెంట బిఆర్.ఎస్ పార్టీ నాయకులు నాయకులు సుధాకర్ రెడ్డి, సింగోటం నాయుడు, బీసీ రెడ్డి, వెంకటేష్ గౌడ్, బుచ్చన్న, పూజారి రాముడు, సర్వేష్ గౌడ్, శేఖర్, ప్రేమ్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## బీచుపల్లి ఆంజనేయస్వామిని సందర్శించుకున్న డి.ఎస్.పి మొగులయ్య

**గద్వాల జనవరి 05 ప్రభాతవార్త :** గద్వాల నూతన డిఎస్పి మొగులయ్య ఆదివారం బీచుపల్లి శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయాన్ని సందర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ ఈఓ రామన్ గౌడ్, అర్చకులు మారుతి ఘనంగా స్వాగతం పలికి దేవాలయంలో పూజలు నిర్వహించి స్వామి వారి శేష వస్త్రం బహుకరించారు. ఇటిక్యాల ఎస్ఐ తదితరులు ఉన్నారు.

